ninadam.in
తెలుగు దినపత్రిక
# నినాదం
నిఖార్సైన జర్నలిజం
శనివారం, మార్చి 21, 2026 | సంపుటి - 22 | సంచిక 173 | వెల - 7 | పేజీలు - 12 - 8
Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

# బరాబర్ కొంట.. ఎవరాపుతరో చూస్త

- ఎమ్మెల్సీ మనోడే ఎనీ టైమ్ తేండి
- పీడీఎస్ దొంగలకు 'గజ్జెల' స్వాగతం
- ఆ మిల్లుకు క్యూ కడుతున్న వాహనాలు
- అధికారులేం చేస్తున్నారంటూ విమర్శలు
- ఉన్నతాధికారులకు తలనొప్పిగా తంతు.!

**ఆదిలాబాద్ బ్యూరో, మార్చి20(నినాదం):**
ఏళ్లతరబడి దందాలో ఆరితేరిన పీడీఎస్ స్మగ్లర్లు సరికొత్త వ్యూహాలు రచిస్తున్నారు.ఇది వరకు మామూళ్లతో మేనేజ్ చేస్తే ఇప్పుడు పొలిటీషియన్లు,ప్రభుత్వంలో భాగస్వాములైన ప్రజా ప్రతినిధుల పేర్లనే వాడుకుంటున్నరు. సరిగ్గా ఇలాంటి కథే ప్రస్తుతం కాగజ్ నగర్ లో ఓటి నడుస్తోంది.రైస్ మిల్లుల ముసుగులో వందల కోట్లు సర్కారు సొమ్ము లూటీ చేసిన ఓ మిల్లర్ దందా కొనసాగింపులో ఏకంగా ఓ ఎమ్మెల్సీ పేరునే వాడుకుంటున్నాడు.తద్వారా రాత్రీ పగలు దర్జాగా పీడీఎస్ రైస్ కొంటున్నాడు.


నేరుగా రైస్ మిల్లులోకి ఆటో


శుక్రవారం పట్టపగలే దర్జాగా మిల్లు వైపు వెళ్తున్న పీడీఎస్ ఆటో

## ఆ గజ్జెల మోత వెనకున్నదెవరు.?

మిల్లుల మాటున కొందరు సాగించిన విధ్వంసాల మూలంగా రాష్ట్ర వ్యాప్తంగా వేల కోట్ల సర్కారు సొమ్ము వారి వ్యక్తిగత ఖాతాల్లోకి వెళ్లింది. విషయం గ్రహించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యులపై నిప్పులు చెరిగారు.దీన్ని సరిచేసేందుకు చారిత్రక నిర్ణయం తీసుకున్నారు.మింగిన సొమ్మంతా డిఫాల్టర్లనుండి తిరిగిరాబట్టాలని హుకూం జారీచేసారు. అంతేకాకుండా ఇలాంటివి పునరావృతమైతే అక్కడి కలెక్టర్,ఎస్పీలనే సస్పెండ్ చేస్తామని వార్నింగ్ సైతం ఇచ్చారు.ఈ మేరకు రాష్ట్రంలోని జిల్లాలన్నీ దాదాపుగా దారిలో పడ్డాయి.కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మాత్రం దీనికి అతీతంగా మారింది. స్థానికంగా గల ఓ స్మగ్లర్ తన దందాను ఏమాత్రం ఆపటంలేదు. వెరసీ ఆపేసిన కొందరు మిల్లర్లను సైతం ఏమీ కాదు షురూ చేయండని ధైర్యాన్నిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు తెలిసింది.

## సీఎం గీయం జాన్తానై వచ్చేయండి..!

కాగా ఈ విషయంలో సీఎం ఆదేశానుసారం ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుండటంతో స్థానికంగా గల ఇలాంటి మరికొన్ని మిల్లులు బిచానా సర్దేసాయి.సీఎం రియాక్టయిన తీరుకు భయపడి పూర్తిగా గేట్లు మూసేసాయి. మిగిలిన ఈ ఒక్క మిల్లర్ మాత్రం సీఎం,గీఎం జాన్తానై నావెనుక ఇదే ప్రభుత్వ ఎమ్మెల్సీయే ఉన్నడు మీరు తేండి ఏమీ కాదని చిరు దొంగలకు ధీమానిస్తున్నాడట.ఎవరివి వాళ్లకు ఇస్తున్నా ఎవడాపుతడో చూస్తా అంటూ పీడీఎస్ దొంగల ఆటోలు,వ్యాన్లకు లైన్ క్లియర్ చేస్తున్నాడట. పరిస్థితులు సైతం తన తీరుకు అనుగునంగానే ఉండటంతో జిల్లాలోని చిరు దొంగలంతా వారి,వారి ఆటోలు,ట్రాలీలతో సదరు మిల్లుకు క్యూ కడుతున్నారట. ఇదంతా తెలిసిన స్థానికులు సదరు ఈ స్మగ్కర్ కు ఆ ఎమ్మెల్సీ ఎవరో నిజంగానే అండగా ఉన్నాడా,లేక మిల్లర్ తన పేరు వాడుకుంటున్నాడా అని చర్చించుకుంటున్నారు.రాష్ట్ర స్థాయి బాధ్యులు కల్పించుకుని ఇప్పటికైనా ఈ గలీజు 'గజ్జెల' మోతకు ముగింపు పలకాలని,అప్పుడే సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ నెస్ కు ఆసిఫాబాద్ జిల్లాలోనూ ఫలితం ఏర్పడుతుందని సామాజిక వాదులు డిమాండ్ చేస్తున్నారు.

# ₹ 3,24,234 కోట్లు

## 'ప్రజా క్షేమం సామాజిక న్యాయం' నినాదంతో ముందుకు సాగిన తెలంగాణ బడ్జెట్

- రెవెన్యూ వ్యయం.. రూ.2,34,406 కోట్లు
- మూలధన వ్యయం.. రూ.47,267 కోట్లు
- ఆరు గ్యారంటీల అమలుకు.. రూ.50,713 కోట్లు
- 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవిత బీమా
- జీవిత బీమా పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయింపు
- మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్.. రూ.1500 కోట్లు
- ఇందిరమ్మ ఇళ్లు.. రూ.5,500 కోట్లు,
- అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క

2 వివరాలు





# హర్మూజ్ విముక్తికి అమెరికా యత్నాలు

- ఇరాన్ బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం
- యూరోపియన్ దేశాలు సైతం మద్దతు
- మధ్యప్రాచ్యంలో తగ్గని ఉద్రిక్తతలు
- అమెరికా ,ఇజ్రాయిల్‌లకు మద్దతు ఇస్తే దాడులు తప్పవు
- గల్ఫ్ దేశాలకు ఇరాన్ గట్టి హెచ్చరికలు

6 వివరాలు

**వాషింగ్టన్/లండన్:**
హర్మూజ్‌పై పట్టుకు అమెరికా యత్నాలు ప్రారంభించింది. ఇరాన్ క్షిపణులను, డ్రోన్లు, బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది. హర్మూజ్ విముక్తికి యూరోపియన్ దేశాలు సైతం మద్దతుగా ముందుకు సాగనున్నాయి. ప్రపంచ చమురు జీవ నాడి హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు కీలక పోరును అమెరికా మొదలుపెట్టింది. ఇందుకోసం తీర ప్రాంతంలో ఇరాన్ మోహరించిన క్షిపణి లాం చర్లు, డ్రోన్లు, బోట్లు వంటి లక్ష్యాలను ఛేదించేందుకు తక్కువ ఎత్తులో ఎగిరే అపాచీ అటాక్ హెలికాప్ట, తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలను రంగంలోకి దింపినట్లు అమెరికా సైనికాధికారులను ఉటంకిస్తూ కథనంలో వెల్లడించింది. మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరిన తరుణంలో, ఇరాన్ తన పొరుగు దేశాలకు కీలక విజ్ఞప్తి చేస్తూనే పరోక్ష హెచ్చరికలు జారీ చేసింది.

# ఫోన్ ట్యాపింగ్‌పై చట్టప్రకారమే ముందుకు

## హరీష్ రావుకు ట్యాపింగ్‌లో ఊరట అబద్ధం

## పదో తరగతి పరీక్షలు లేకుండా 12 తరగతులు

- తెలంగాణ విద్యారంగంలో కీలక మార్పులకు కసరత్తులు
- కమిటీ అధ్యయనం తరువాత విస్తృత స్థాయిలో ప్రజాభిప్రాయం
- మేం వచ్చాక రూ.3.47 లక్షల కోట్లు అప్పులు చేశాం
- రూ.3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం అప్పులకు చెల్లించాం
- కెసిఆర్‌ను గృహనిర్బంధం చేసిన కెటిఆర్, హరీష్ రావు
- హిల్టు టీడీఆర్ భూ బదలాయింపులపై ఎలాంటి విచారణకైనా సిద్ధం
- డ్రగ్స్‌పై నోరుమెదపని బిజెపి, బిఆర్ఎస్ నేతలు
- మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి



2 వివరాలు

**హైదరాబాద్,మార్చి20 (నినాదం):**
ఫోన్ ట్యాపింగ్ విషయంలో చట్టప్రకారమే ముందుకు వెళ్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కేసులో కీలక నిందితుడు ప్రభాకర్‌రావు అందుబాటులో లేకపోవడంతో దర్యాప్తు 20 నెలలు ఆలస్యమైందన్నారు. ఇందులో అరెస్టులు తప్పవని కూడా అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ దొరికినా.. భాజపా నేతలు మాట్లాడటం లేదని, బీఆరఎస్, భాజపా కలిసి ఉన్నారనేందుకు ఇదే నిదర్శనమని చెప్పారు.



## ఎల్పీజిని ప్రజలకు అందుబాటులో ఉంచాలి

అంతర్జాతీయ మార్కెట్‌లో అమ్మడానికి వీల్లేదు

ఎపి హైకోర్టు కీలక ఆదేశాలు

2



## నేడు రంజాన్ ముగిసిన ఉపవాసాలు

పవిత్ర రంజాన్ మాసం ముగిసింది. చివరి శుక్రవారం దేశవ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గురువారం నెలవంక దర్శనం లేకపోవడంతో శుక్రవారం నెలవంక ఆధారంగా శనివారం రంజాన్ పండగను నిర్ణయించారు.

# బడ్జెట్‌లో ఆర్భాటపు అంకెలు.. ప్రగల్భాలు

- అప్పులకోసం చేసే ప్రయత్నాలే ఎక్కువ
- బడ్జెట్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు

**హైదరాబాద్, (నినాదం):**
అంకెల ఆర్భాటాలు, కేటాయింపుల ప్రగల్భాలే తప్ప బడ్జెట్‌లో ఒరిగిందేమీ లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ఆదాయాన్ని పండబెట్టి.. అప్పుల కోసం అర్రులు చాచే బ్జడెట్ ఇది అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



▸▸వివరాలు 12లో..

### భద్రాచలం దేవస్థానం

# అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- మూడు దశల్లో దేవస్థానం అభివృద్ధి పనులు
- మాస్టర్ ప్లాన్‌పై చర్చించిన మంత్రులు

2

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థాన అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి అన్నారు.

# జాబ్ ఫస్ట్ అనేది కూటమి లక్ష్యం

- 20లక్షల ఉద్యోగాల కల్పనకు కట్టుబడి ఉన్నాం
- ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీ
- మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్లు
- ఉగాది ఉత్సవాల్లో సిఎం చంద్రబాబు వెల్లడి

2



**అమరావతి, నినాదం:**
ఏటా ఉగాది రోజున జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీ నెరవేరుస్తామని అన్నారు.ఏపీపీఎస్సీ ద్వారా 10,060 ఉద్యోగాలు భర్తీచేసేందుకు ఈసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేసినట్లు ఆయన ప్రకటించారు. మే 15 నుంచి అక్టోబరు వరకు వివిధ నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు భర్తీచేస్తామని వివరించారు.

# బడ్జెట్ కేటాయింపులు అధ్వానం

- ఆరు గ్యారెంటీలకు సమాధి కట్టారు
- మహిళల పెన్షన్‌పై మాట్లాడని బడ్జెట్
- పేదలపట్ల చిత్తశుద్ధి లేని బడ్జెట్ ఇది
- భట్టి కేటాయింపులపై హరీష్ రావు పెదవివిరుపు
- బడ్జెట్ ప్రతులను చించేసిన బీఆర్ఎస్
- ఆరు గ్యారెంటీలపై సభలో నినాదాలు
- బడ్జెట్ బహిష్కరిస్తూ వాకౌట్

2

*తెలంగాణ అసెంబ్లీలో ఇవాళ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా మోసమని ప్రతిపక్ష బీఆరఎస్ పార్టీ మండిపడింది. బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రతిపక్ష బీఆరఎస్ సభ్యులు ప్రతులను చింపిపారేశారు. అనంతరం సభ నుంచి వాకౌట్ చేశారు. దాంతో అసెంబ్లీలో ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. తెలంగాణ బడ్జెట్‌పై బీఆరఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావు పెదవిరిచారు. ఇదొక ఝూటా బ్జడెట్ అని, బోగస్ బడ్జెట్ అని ఆయన మండిపడ్డారు.*




# అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా హుజూరాబాద్ కాలేజ్ గ్రౌండ్

ఎటు చూసినా చెత్తాచెదారం
పగలగొట్టిన మద్యం సీసాలు
మున్సిపాలిటీ ఆఫీసుకు సమీపంలోనే గ్రౌండ్

**హుజూరాబాద్,మార్చి20(నినాదం):** హుజూరాబాద్ పట్టణంలోని కాలేజ్ గ్రౌండ్ ప్రస్తుతం దుర్వినియోగానికి గురవుతూ చెత్తకుండీలా మారిపోయింది. ఒకప్పుడు విద్యార్థులు క్రీడలకు, యువత వ్యాయా మానికి, ప్రజలు ఉదయం సాయంత్రం వాకింగ్‌కు ఉపయోగించు కునే ఈ ప్రదేశం ఇప్పుడు చెత్తతో నిండిపోవడం ఆందోళన కలిగి స్తోంది. కొంతమంది నిర్లక్ష్యంగా చెత్త వేయడం, మద్యం సేవించి బాటిళ్లు పగులగొట్టడం, సిగరెట్ తాగడం వంటి చర్యలు పెరుగు తున్నాయి. దీనివల్ల గ్రౌండ్‌లో ఎక్కడ చూసినా గాజు ముక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ పరిస్థితి విద్యార్థులకు, వాకింగ్‌కు వచ్చే వారికి ప్రమాదకరంగా మారింది. ఇది మున్సి పాలిటీ కార్యాలయానికి అతి సమీపంలో ఉండటం గమనార్హం. అయినప్పటికీ సంబంధిత అధికారులు దీనిపై సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా ఉపయోగానికి ఉద్దేశించిన స్థలం ఇలా నిర్లక్ష్యానికి గురవడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ప్రజలు, విద్యా ర్థులు ఈ సమస్యపై ఆందోళన వ్యక్తం చేస్తూ, వెంటనే శుభ్రత చర్యలు చేపట్టి, గ్రౌండ్‌ను కాపాడాలని, మద్యం సేవించడం, చెత్త వేయడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కాలేజ్ గ్రౌండ్‌ను మళ్లీ పరిశుభ్రంగా మార్చి ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకో వాల్సిన



అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

# పరీక్ష కేంద్రానికి ఫోన్లు ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబడవు

నాగర్ కర్నూల్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్



**నాగర్ కర్నూల్ మార్చి 20 (నినాదం) :** జిల్లాలో నిర్వహించబడనున్న ఎస్.ఎస్.సి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి శుక్రవారం నాగర్ కర్నూల్ రెవిన్యూ అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లాలోని అందరూ పదో తరగతి పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ లు, డిపార్ట్మెంట్ అధికారులతో జూమ్ మీటింగ్ ద్వారా ముఖ్యమైన సూచనలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులపై కఠినంగా ఫ్రిస్కింగ్ నిర్వహించాలని, నిషేధిత వస్తువులు ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదు. పరీక్షా సిబ్బంది ఎవరూ కూడా మొబైల్ ఫోన్‌లను వినియోగించరాదు. ప్రతి పరీక్షా రోజున చీఫ్ సూపరింటెండెంట్ (జూ) వారు విధి రిజిస్టర్‌లో "చీశ్రీఫ్త్రశీఅవ" సర్టిఫికేట్ నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులు, సిబ్బంది ఎవరూ కూడా ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం పూర్తిగా నిషేధించబడింది. ఇతర సిబ్బంది కూడా సెల్‌ఫోన్‌లను పరీక్షా కేంద్రంలోకి తీసుకురావద్దు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు కేంద్రంలోకి ప్రవేశించే ముందు తమ మొబైల్ ఫోన్‌లను వాహనాల్లోనే జమ చేయాలని సూచించారు. క్లెరికల్ సిబ్బంది, రిలీవర్లు పరీక్ష పూర్తయ్యే వరకు జూ గదిని విడిచిపెట్టకూడదు. అన్ని రకాల ద్విచక్ర నాలుగు చక్రాల వాహనాలు పరీక్షా కేంద్రం బయట పార్క్ చేయాలని సూచించారు. చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్‌లు పరీక్ష సమయంలో తరచూ పర్యవేక్షణ చేయాలి. ఎటువంటి అనధికార వ్యక్తులు పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. ప్రశ్నపత్రాలను పోలీస్ స్టేషన్ నుండి పరీక్షా కేంద్రానికి తీసుకురావడం, అలాగే పరీక్ష అనంతరం కేంద్రం నుండి పోస్టాఫీసుకు పంపే సమయంలో తప్పనిసరిగా ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని అన్ని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఈ జూమ్ సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ రమేష్ కుమార్, పరీక్షల నిర్వహణ అధికారి రాజశేఖర్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న ఈటల తులాభారం

జమ్మికుంట మాజీ
సర్పంచ్ వినూత్న ఆలోచన..

**జమ్మికుంట, మార్చి 20 (నినాదం) :** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ప్రస్తుత మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ పుట్టినరోజు సందర్భంగా జమ్మికుంట మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ ఎర్రం రాజు సురేందర్ రాజు తన అభిమానాన్ని చాటుకుంటూ పురాతన కాలంలో శ్రీకృష్ణునికి తులాభారం చేసిన విధంగానే ఈటల రాజేందర్ కు సుమారు 25 వేల రూపాయి నాణేల తో తులాభారం నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. తాము అభిమానించే నాయకుడికి తమ వంతు కృతజ్ఞతగా తులాభారం నిర్వహించడం జరిగిందని ఎంపీ ఈటెల రాజేందర్ ఇలాంటి పుట్టినరోజు వేడుకలు ఎన్నో జరుపుకోవాలని అత్యుత్తమ పదవులను పొందాలని కోరుకుంటున్నట్లు సురేందర్ రాజు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈటెల కు చేసిన తులాభారం పై చర్చ కొనసాగడంతో పాటు



సోషల్ మీడియాలో ఈ వార్త కాస్త వైరల్ గా మారింది. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మాజీ జడ్పిటిసి డాక్టర్ శ్రీరామ్ శ్యామ్ కొమ్ము అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బడ్జెట్ అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత

వ్యవసాయం, విద్య, వైద్యం, సామాజిక భద్రత రంగాలకు కీలక కేటాయింపులు
మాజీ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి గడ్డం విలాస్ రెడ్డి



**కరీంనగర్, మార్చి 20(నినాదం) :** తెలంగాణ ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన 2026-27 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయం, రైతు సంక్షేమం, విద్య, వైద్యం, మానవ వనరులు, కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా రూపొందించబడిందని అభిప్రాయం వ్యక్తమ వుతోంది.ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టడం ఒక ముఖ్య నిర్ణయంగా నిలిచింది. అదేవిధంగా, ఒక కోటి పదిహేను లక్షల కుటుంబా లకు 'ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం'ను అమలు చేయడం హర్షణీయంగా భావిస్తున్నారు.ఈ మేరకు మాజీ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గడ్డం విలాస్ రెడ్డి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# ఎస్సీ యువతకు ఈవీ వాహనాలపై భారీ సబ్సిడీ

జిల్లా ఎస్సీ కార్పోరేషన్ బాధ్యులు సురేష్



**ఆసిఫాబాద్, మార్చి20 (నినాదం):** ఆసిఫాబాద్ జిల్లా: నిరుద్యోగ ఎస్సీ యువతకు స్వయం ఉపాధి కల్పించేం దుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) కొనుగోలుపై భారీ సబ్సిడీ అందించనున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ అధికారి డాక్టర్ ఎం. సురేష్ కుమార్ వెల్లడించారు. ఈ పథకం కింద 2 వీలర్ వాహనాలపై 90 శాతం వరకు, 3 వీలర్ వాహనాలపై 70 శాతం వరకు సబ్సిడీ లభించనుంది. స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.అభ్యర్థులు ఎస్సీ వర్గానికి చెందిన నిరుద్యోగులు కావాలి. దరఖాస్తు చేసుకునే సమయంలో కుల ధృవీకరణ పత్రం, ఆదాయ ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా సమర్పించాలి. ఆసక్తిగల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు ప్రక్రియ మార్చి 17 నుంచి ప్రారంభమై మార్చి 24 వరకు కొనసాగుతుంది. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సురేష్ కుమార్ సూచించారు. దరఖాస్తు చేసేటప్పుడు పత్రాలను జాగ్రత్తగా పరిశీలించి, ఎటువంటి పొరపాట్లు లేకుండా సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9015502900, 9182283832 నంబర్లను సంప్రదించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

# భూస్వాములకు సింహ స్వప్నం.. కామ్రేడ్ తాను నాయక్



**ఖమ్మం, మార్చి 20(నినాదం ):** భూస్వాములకు సింహస్వప్నం కామ్రేడ్ తాను నాయక్ ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ పైన తాను నాయక్ గారి 77వ వర్థంతి వేడుకలు నిర్వహించడం జరిగింది . కార్యక్రమంలో తెలంగాణ జాగృతి గిరిజన సమాఖ్య బంజారా నాయకులు హాజరయ్యారు వర్ధంతి వేడుకలను ఉద్దేశించి తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి భానోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం అలుపెరగని పోరాటం సలిపిన యోధుడు కామ్రేడ్ నాయక్ బంజారా కమ్యూనిటీ లోనే మొట్టమొదటి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్న కుటుంబం తాను నాయక్ ది సాయి ద రైతాంగ పోరాటంలో తాను నాయక పాత్ర ఎంతో కీలకమైనది ఒకపక్క కాసిం రాజ్వి సైన్యం గిరిజన తండాల పైన గ్రామాల పైన దాడులు చేస్తూ గొడ్డు గోదని చిత్రం చేస్తూ మహిళలపై అరాచకాలను చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తూ భూములు గుంజుకుంటున్న సందర్భంలో దేశముకు కడారి నర్సింగరావు దొర తాను నాయక్ ను మట్టు పెట్టాలని పథకం వేస్తున్నారు తండా యువకులను మహిళలను వృద్ధులను తండ మధ్యలో కూర్చోబెట్టి పైన వరిగడ్డి వేసి నిప్పు పెట్టి తగలబెట్టాలని చూస్తున్న సందర్భంలో తాను నాయక్ కాసిం రాజ్విని గర్జిస్తూ నా ప్రజలను ఏమైనా చేస్తే నీ అంతు చూస్తానని వారి ముందుకు వస్తాడు ఒక ద్రోహి ఇచ్చిన సమాచారం మేరకు కానునాయకును కడారి నర్సింగరావు దొర ఆచూకీ కనిపెట్టి పట్టుకొని ఎడ్ల బండి చక్రాలకు కట్టేసి తుపాకులతో కాల్చుకుంటూ బండిని రాళ్లు గుట్టలు కంప చెట్లలో నుంచి ముందుకు ఎడ్లను కొడుతూ బండిని పోనిస్తూ ఉంటారు కామ్రేడ్ తాను నాయక్ శరీరం తూట్లు తూట్లుగా మాంసపు ముద్దలు రాలిపడుతూ ప్రాణాలు కోల్పోతాడు అంతం చేస్తే ఆ తండాల నుంచి గిరిజన యువకులు దళంలో చేరారని కమ్యూనిస్టు పార్టీ దరికి రారని ఈ ఘాతుకానికి పూనుకుంటారు తాను నాయక చనిపోతూ కూడా కమ్యూనిస్టు పార్టీ వర్ధిల్లాలి ఎర్రజెండా వర్ధిల్లాలి దున్నేవానికి భూమి అంటూ ప్రాణాలు దులుతాడు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వాములు దేశముక్కలు జర నుండి పది లక్షల ఎకరాల భూమిని విడిపించి ప్రజాపరం చేస్తారు ఈనాటి యువకులు తాను నాయక్ స్ఫూర్తిని పొంది ప్రజా సమస్యల పట్ల రాజీలేని పోరాటాలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుకు పోవాలని అన్నారు వెలుగుమట్ల బాధితులకు పూర్తిస్థాయి న్యాయం జరిగేంత వరకు 740 మందికి నిరుపేదలైనటువంటి వాళ్ళందరికీ అక్కడ వేసుకున్న ప్రతి గుడిసెకు పక్కా ఇండ్లు మంజూరు చేసి భూమి పట్టా ఇచ్చేంతవరకు తెలంగాణ జాగృతి వారి పక్షాన నిలబడుతుంది పాలకులతో కలపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బోడ వీరన్న నాయక్ రమేష్ నాయక్ బంజారా సీనియర్ నాయకులు భీముడు నాయక్ భూక్యరాంబాబు నాయక్ రేఖ చౌహన్ జాగృతి రాష్ట్ర కార్యదర్శి గుంటి సుందర్ జిల్లా అధ్యక్షురాలు గట్టు కరుణ కార్యదర్శి వనం నాగేందర్ రాష్ట్ర నాయకురాలు అనిత చౌదరి వినోదాభాయ్ గణేష్ నాయక్ అరవింద నాయక్ శీను నాయక్ రమేషు రామకృష్ణ వీరన్న రాంబాబు రాంబాబు కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# వాసవి దేవాలయంలో పారాయణం

మహిళలకు లక్కీ డిప్ ద్వారా చీరల బహుమతి
ప్రతి శుక్రవారం ప్రత్యేక కార్యక్రమంగా కొనసాగింపు

**కల్వకుర్తి, మార్చి 20 (నినాదం) :** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం సందర్భంగా భక్తి శ్రద్ధలతో పారాయణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ప్రారంబమైన ఈ పారాయణంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్ని పారాయణం చేశారు. ఈ సందర్భంగా దేవాలయ ట్రస్ట్ చైర్మన్ జూలురి రమేష్ బాబు పారాయణం లో పాల్గొన్న మహిళలకు లక్కీ డిప్ ద్వారా అమ్మవారి చీరను అందించే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం పారాయణానికి హాజరయ్య మహిళలకు లక్కీ డిప్ ద్వారా ఒకరికి అమ్మ వారి చీరను బహుమతిగా అందజేస్తామని తెలిపారు. అనంతరం నిర్వహించిన లక్కీ డిప్ లో మారం సునీత ను అదృష్టం వరించడంతో ఆమెకు అమ్మవారి చీర ను బహుమతిగా అవోపా ట్రెజరర్ కల్వ ఆంజనేయులు



అందజేశారు.ఈ లక్కీ డిప్ భక్తులలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో దేవాలయ పూజారి లక్ష్మీనా రాయణ, కల్వకుర్తి మహిళా సంఘం అధ్యక్షురాలు గోవింద్ మౌనిక, వాసవి పారాయణం బృందం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# భక్తుల ఇంటికే రాములోరి తలంబ్రాలు

**హుజూరాబాద్,మార్చి20(నినాదం) :** ఆర్టీసీ కార్గో ప్రత్యేక సేవలు లారా ప్రారంభించింది. భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో జరిగే శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా ఉపయోగించే పవిత్ర తలంబ్రాలను భక్తుల ఇంటికే చేరవేయడానికి ఆర్టీసీ కార్గో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. ఈ విషయాన్ని హుజూ రాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ పోస్టర్ ఆవిష్కరించి తెలియజేశారు.భక్తులు 151 రూపా యలు చెల్లించి బుకింగ్ చేసుకున్నట్లయితే ఇంటి వద్దకే తలంబ్రాలు చేరవేస్తామని తెలిపారు.ఈ తలంబ్రాలకు విశేష ఆధ్యాత్మిక ప్రత్యేకత ఉందని వీటిని శుభకార్యాలలో అక్షింతలుగా ఉపయోగిస్తే



శ్రీరాముడి ఆశీస్సులు ఉంటాయని భక్తులకు నమ్మకం ఉందన్నారు.ఈ తలంబ్రాలలో అక్షింతల తో పాటు రెండు ముత్యాలు కూడా ఉంటాయని తెలిపారు.భక్తుల సౌకర్యార్థం నేరుగా ఇంటికే వచ్చి ఆర్టీసీ సిబ్బంది డెలివరీ చేస్తారని తెలియజేశారు .ఇంటికి వచ్చి బుక్ చేసుకున్న వారందరికీ అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమం లో ట్రాఫిక్ మేనేజర్ సారయ్యపాల్గొన్నారు.మీరు తలంబ్రాలు బుకింగ్ చేసుకొనుటకు దగ్గరలో ఉన్న కార్గో సెంటర్లలో మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ల వద్ద బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9154298559 సంప్రదించాలని తెలిపారు.

# అర్హులైన రైతులు రైతు భరోసాకి దరఖాస్తు చేసుకోవాలి..!

**పాలేరు మార్చి 20( నినాదం) :** అర్హులైన మండల రైతులు రైతు భరోసా కి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి ఎం. రాధ కోరారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమెమాట్లాడుతూ. నేలకొండపల్లి మండలంలో ఫిబ్రవరి 28వ తేదీ నాటికి కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన 585 రైతు భరోసా కి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపినారు. గతంలో రైతు భరోసా నిధులు పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేయవలసిన అవసరం లేదు. కొత్తగా పట్టా పాస్ బుక్ పొందిన రైతులు పాస్ బుక్ జిరాక్స్ లేదా డిజిటల్ సైన్ ఆన్లైన్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ మరియు దరఖాస్తు ఫారం కి జత చేసి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి దరఖాస్తు అందజేయాలని కోరారు. దరఖాస్తు చేయడానికి




ఈనెల 25న చివరి తేదీ అని తెలిపారు. కావున రైతు సోదర సోదరీమణులు కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చినవారు అందరూ దరఖాస్తు అందజేయాలని తెలిపారు. చేసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి ఎం. రాధ కోరినారు. మన మండలంలో ఫిబ్రవరి 28వ తేదీ నాటికి కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన 585 రైతు భరోసా కి దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపినారు. గతంలో రైతు భరోసా నిధులు పొందిన వారు మళ్లీ దరఖాస్తు చేయవలసిన అవసరం లేదు. కొత్తగా పట్టా పాస్ బుక్ పొందిన రైతులు పాస్ బుక్ జిరాక్స్ లేదా డిజిటల్ సైన్ ఆన్లైన్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ మరియు దరఖాస్తు ఫారం కి జత చేసి సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి దరఖాస్తు అందజేయాలని కోరారు. దరఖాస్తు చేయడానికి ఈనెల 25న చివరి తేదీ అని తెలిపారు. కావున రైతు సోదర సోదరీమణులు కొత్తగా పట్టా పాస్ బుక్ వచ్చినవారు అందరూ దరఖాస్తు అందజేయాలని తెలిపారు.

## ఘనంగా ఎంపీ ఈటెల జన్మదిన వేడుకలు



**అల్వాల్, మార్చి 20(నినాదం):** మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ జన్మదిన సందర్భంగా షామీర్పేట్ లోని నివాసంలో పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా జరిగాయి. కేక్ కటింగ్. సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మేడ్చల్ అర్బన్ డిస్టిక్ సెక్రెటరీ చింతల మాణిక్య రెడ్డి, సూర్య, శ్రీనివాస్ వర్మ, సాయి, మోహన్, అభిమానులు కార్యకర్తల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు

## పండుగలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని : సీఐ ప్రశాంత్



**అల్వాల్, మార్చి 20( నినాదం) :** పండుగలు స్నేహ భావాన్ని పెంచుతాయని. ప్రశాంత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలని సీఐ ప్రశాంత్ పేర్కొన్నారు. అల్వాల్ సర్కిల్ లో గల మసీదులను సిఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో మజీద్ పరిసర ప్రాంతాలలో బందోబస్తు తనిఖీలు చేపట్టారు రంజాన్ పురస్కరించుకొని ప్రజలందరూ సోదర భావంతో మెలగాలనిమత సామ్రాస్యానికి తావు లేకుండాపండుగలు నిర్వహించుకోవాలని తెలిపారు

## పేద ముస్లింలకు రంజాన్ కిట్ల పంపిణీ

**సిద్దిపేట, మార్చి20 (నినాదం):** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మైనారిటీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని సిద్దిపేట మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్లు నాగరాజు రెడ్డి, ప్రవీణ్ విమర్శించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఏకలవ్య భవన్‌లో 26, 27,6 వ వార్డుల పేద ముస్లింలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డి లబ్ధిదారులకు సరుకులు అందజేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింలందరికీ రంజాన్ కిట్లు అందించేదని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కార్యక్రమాన్ని కొనసాగించడం లేదని అన్నారు. ప్రభుత్వం కిట్లు ఇవ్వకపోయిన వార్డు కౌన్సిలర్లు ప్రవీణ్, నాగరాజు రెడ్డి లు పేద ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా నిత్యావసర సరుకులు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం తమ సొంత ఖర్చులతో పేద ముస్లింలకు నిత్యావసర సరుకులు అందిస్తున్నారని గుర్తు చేశారు. ముస్లింలందరూ రంజాన్ పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, బీఆర్ఎస్ నాయకులు రాజు, బాబా, అశోక్, ఫసియుద్దీన్, షాదుల్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## అల్లా దయతో తెలంగాణ సుభిక్షంగా ఉండాలి

ఈద్-ఉల్-ఫితర్ పవిత్ర రంజాన్ పర్వదిన
శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట మార్చి 20,(నినాదం) :** ఈద్-ఉల్-ఫితర్ (పవిత్ర రంజాన్) పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర, సోదరీమణులకు రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర దివ్య ఖురాన్ అవతరించిన ఈ గొప్ప మాసంలో కఠోర ఉపవాస దీక్షలకు రంజాన్ ఒక ముగింపు వేడుక అని తెలిపారు.ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అతిపెద్ద గొప్ప పండుగల్లో ఒకటి రంజాన్ అని కొనియాడారు. చెడు భావనల్ని, అధర్మాన్ని, ద్వేషాన్ని రూపుమాపే గొప్ప పండుగ రంజాన్ అని అన్నారు.ఈ పవిత్ర మాసం దీక్షలు , ప్రేమ, దయ సౌభ్రాతృత్వ గుణాలను పంచుతుందని పేర్కొన్నారు.గంగా జమునా తెహజీబ్‌కు తెలంగాణ ప్రతీక అని అన్నారు. లౌకికవాదం, మత సామరస్య పరిరక్షణలో తెలంగాణ, దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. అల్లా దయతో రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నాను అని అన్నారు.ఈ పండుగ మానవాళికి ఇచ్చే సందేశమని పేర్కొన్నారు. కుల మతాలకతీతంగా ఒకరి పండుగలను మరొకరు సోదర భావంతో కలిసిమెలిసి జరుపుకునే సంస్కృతి మన తెలంగాణ వారిది అని అన్నారు.ముస్లిం సోదరులు చేసే ప్రార్థనలు సఫలం కావాలని, అల్లాహ్ దీవెనలతో రాష్ట్ర ప్రజలకు సకల శుభాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

# హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలం

మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్

**సిద్దిపేట మార్చి 20, (నినాదం):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలు,ముఖ్యంగా 6 గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ మండిపడ్డారు.హామీలు అమలు చేయాలని కోరుతూ శుక్రవారం బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు.అనంతరం పరిపాలన అధికారి రాజ్ కుమార్ కు హామీలు అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చి మాట్లాడారు.రుణమాఫీ, నిరుద్యోగ భృతి,మహిళలకు నెలకు ?2,500 వంటి హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు.హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.6 గ్యారెంటీలు 420 హామీలు అమలు



చేయకుండా ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు.రైతులకు హామీ ఇచ్చిన విధంగా రుణమాఫీ పూర్తిగా అమలు కాలేదని,రైతన్నను నిలువునా మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. గ్యారెంటీలు అమలు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు ఈ కార్యక్రమం లో వంగ రామచంద్రారెడ్డి, కొత్తపల్లి వేణు గోపాల్,బాసంగారి వెంకట్,కాసన గొట్టు సంతోష్,గాడిపల్లి భాస్కర్,,విభీషణ్ రెడ్డి, తొడుపునూరి వెంకటేశం, మనోహర్, ప్రసాద్, అశోక్,శ్రీనివాస్, సత్యనారాయణ,కెమ్మసారం సంతోష్,సునీల్, కార్తీక్ కనకరాజు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమారెడ్డి,పద్మ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# అభిశంసనతో సాధించేదేమిటి ?

సర్ ప్రక్రియలతో అనేక రాష్ట్రాల్లో లక్షల ఓట్లు తొలగించారు. అయితే తొలగించిన ఓట్లకు సంబంధించి ఎక్కడా పెద్దగా ఫిర్యాదులు అందలేదు. దీంతో ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఆయా పార్టీలు తిరిగి అధికారం పొందుతాయా అన్న సందేహంలో ఉన్నాయి. ప్రధానంగా బెంగాల్లో మమతా బెనర్జీకి అధికార భయం పట్టుకుంది. సర్‌తో బెంగాల్లో 60 లక్షలకు పైగా ఓట్లు తొలగించారని తెలుస్తోంది. సర్ ప్రక్రియ ముగిసిన తరవాత వివిధ రాష్ట్రాలకు ఎన్నికల నగారా మోగింది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దఫాల్లోనూ, మిగిలిన చోట్ల ఏప్రిల్ 9న ఒకే దఫాతో ఎన్నికలు ముగుస్తాయి. ఐదు అసెంబ్లీల పరిధిలో 824 స్థానాలకు జరగనున్న ఈ ఎన్నికల్లో ఎసఐఆర్ పక్రియతో సుమారు కోటీ 40 లక్షల మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. అయితే ఏ రాష్ట్రంలోనూ ప ఎద్దగా వ్యతిరేకత రాలేదు. వ్యతిరేకత కేవలం మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారి నుంచి వచ్చాయి. తాము ఓట్లు కోల్పోయామని పదుల సంఖ్యలో కూడా ఎవ్వరూ ముందుకు రాకపోవడం గమనించాలి. అయితే ఓటు నమోదులో ఇప్పటికీ శాస్త్రీయ పద్దతిని అవలంబించడం లేదు. పక్కాగా ఓటరు కార్డు దక్కడం లేదు. ఓటు నమోదు మొదలు, ఓటు తొలగింపు వరకు అంతా గందరగోళంగా సాగుతోంది. ఈ క్రమంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారు. ఎన్నికల కమిషన్ ఓ రాజ్యాంగ ప్రతిపత్తి గలిగిన సంస్థ. దాని పని అది చేసుకుంటూ పోతున్నది. ఎవరు అధికారంలో ఉన్నా, ఎన్నికల కమిషన్ పనిచేస్తూనే ఉంది. కానీ విపక్ష కాంగ్రెస్, తదితర పార్టీలకు ఇది మింగుడు పడడం లేదు. అందుకు జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన నోటీసులు ఇచ్చారు. ఇది కేవలం రాజ్యాంగ సంస్థ నిజాయితీని నిలదీయడం తప్ప మరోటి కాదు. ఇప్పటికే స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం ప్రవేశ పెట్టిన కాంగ్రెస్ తదితర పక్షాలు తలబొప్పి కట్టించుకున్నాయి. ఇకపోతే రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో 17.4 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల పరిశీలన సర్ పేరుతో తొలగించండతో తట్టుకోలేక పోతున్న ఓట్లను ప్రతిపక్షాలు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను నిలదీసే లక్ష్యంతో అభిశంసన తీర్మానం ప్రవేశ పెట్టారని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. బెంగాల్, అసోం లాంటి రాష్ట్రాల్లో పక్కనే ఉన్న బంగ్లా జాతీయు ఓట్లను తొలగించే ప్రక్రియ జరగింది. అక్రమంగా ఇక్కడ తిష్టవేసి ఓటర్లుగా మారారు. వారే రాష్ట్రాల్లో ఎవరు అధికారంలో ఉండాలో నిర్ణయించే దశకు చేరుకున్నారు. మరో వైపు ఒక్క చట్టబద్ధమైన ఓటరు కూడా తన ఓటు హక్కు కోల్పోకుండా చూశామని సిఇసి జ్ఞానేష్ కుమార్ స్పష్టం చేశారు. ఒక్క అనర్హుడు కూడా ఓటు వేసే అవకాశం లేకుండా చూడటమే తన లక్ష్యమని చెప్పారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తులతో సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన అప్పిలేట్ ట్రిబ్యునళ్లు రోజుకు లక్ష వరకూ ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాయి. నోటిఫికేషన్ రాగానే బెంగాల్ సిఎస్, డిజిపి, హోం శాఖ కార్యదర్శి, కొల్‌కతా సిపిలను ఇసి బదిలీ చేయడం ద్వారా మమతకు వత్తాసుగా ఉన్న వారిని తొలగించింది. పశ్చిమ బెంగాల్‌లో పగ్గాలు చేజిక్కించుకోవాలని, కేరళం, తమిళనాడులోనూ అధికారం నిలబెట్టుకునేందుకు ఆయా పార్టీలు చేస్తున్న ప్రయత్నాలకు నిజంగానే సర్ విఘాతం కలిగించి ఉంటుంది. ఓ వైపు మత విద్వేషాలు, హింసను రెచ్చగొట్టడం ద్వారా కుల, మత విభజనను తీసుకురావడం ద్వారా మరోమారు అధికారంలో కొనసాగాలని మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారు ఎత్తులు వేస్తున్నారు. అందుకే మమతా బెనర్జీ ఏకంగా 50శాతం సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టిక్కెట్లు నిరాకరించింది. తమిళనాడులో డిఎంకె నేతృత్వంలోని ప్రభుత్వం రెండోసారి అధికారాన్ని నిలబెట్టుకునేందుకు ప్రజాతీర్పును కోరుతోంది. పదేళ్ల పాలనలో అభివృద్ధి చెందిన దేశాల జీవన ప్రమాణాలతో పోటీ పడేలా కేరళంను తీర్చిదిద్ది, తీవ్ర పేదరికాన్ని తరిమేసి, ఎన్నో ఉద్యోగావకాశాలు కల్పించినట్లు పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ చెప్పుకుంటోంది. ప్రజానుకూల పాలనకు, ప్రజలపై ఉన్న నమ్మకానికి ప్రతీకగా మరోమారు విజయం సాధిస్తామని చెబుతోంది. అయిదు రాష్ట్రాల్లో ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్య యుతంగా జరగాలని కోరుకుంటున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. అయితే జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసిండం అంత సులువు కాదు. అధికార ఎన్‌డిఎ పూర్తి మద్దతుతో ఉండండతో ఈ ప్రయత్నం ఎరవేరక పోవచ్చు. అలాగే సర్ ప్రక్రియను అడ్డుకోవడం ద్వారా బీహార్‌లో కాంగ్రెస్ తలబొప్పి కట్టించుకుంది. మమతా బెనర్జీ కూడా సుప్రీంతో చివాట్లు తింది. ఇవన్నీ మరచి వీరు చేసప ప్రయత్నాలతో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసే పని తప్ప మరోటి కాదని గుర్తించాలి. అలాగే అధికారంలో ఉంటూ మమతా బెనర్జీ లాంటి వారు రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడడం క్షమించరాని నేరంగా పరిగణించాలి.

# భారత్‌లో ఎల్పీజీ సంక్షోభం..

## ఇంధన భద్రతలో భారత్ వెనకడుగు!?

("నిర్లక్ష్యపు గోతిలో గ్యాస్ 'ఆవు'.. పరాయి దేశాలపై అతిగా ఆధారపడటమే శాపమా? ముందస్తు నిల్వ కేంద్రాల ఏర్పాటులో వైఫల్యం.. వెరసి దేశ ఇంధన భద్రతకు పొంచి ఉన్న పెను ముప్పు! అప్రమత్తం కాకపోతే కోట్ల మంది ఇళ్లలో పొయ్యి వెలగని దుస్థితి తప్పదు!" )

భారతదేశ ఇంధన రంగంలో వంట గ్యాస్ (ద్రవీకృత పెట్రోలియం వాయువు) నేడు ఒక విడదీయలేని భాగంగా మారింది. ముఖ్యంగా 'ప్రధానమంత్రి ఉజ్వల యోజన' వంటి ప్రతిష్టాత్మక పథకాల ద్వారా దేశవ్యాప్తంగా పది కోట్లకు పైగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు అందాయి. నేడు దేశవ్యాప్తంగా ప్రతిరోజూ దాదాపు 60 లక్షల సిలిండర్లు వినియోగించబడుతున్నాయి, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద గృహ వినియోగదారుల సమూహాల్లో ఒకటి. అయితే, వెలుగుతున్న ఈ పొయ్యిల వెనుక ఒక భయంకరమైన సత్యం దాగి ఉంది. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న గ్యాస్ కొరత మరియు సరఫరాలో తలెత్తుతున్న ఆటంకాలు మన దేశ 'ఇంధన భద్రత' (Energy Security) లోని ఘోరమైన లోపాలను వేలెత్తి చూపుతున్నాయి. ప్రభుత్వం దీనిని "ఆందోళనకరమైన పరిస్థితి"గా గుర్తించి, బుకింగ్ పద్ధతులను కఠినతరం చేయడం మరియు అత్యవసర వస్తువుల చట్టాన్ని అమలు చేయడం వంటి తక్షణ చర్యలకు ఉపక్రమించడం మన పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం పడుతోంది.

## పరాయి దేశాలపై అతిగా ఆధారపడటం – ఒక వ్యూహాత్మక ఆత్మహత్య

మన దేశానికి అవసరమైన వంట గ్యాస్‌లో 60 శాతానికి పైగా కేవలం దిగుమతుల ద్వారానే వస్తోంది. అందులోనూ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఈ దిగుమతుల్లో 90 శాతం ఒక్క మధ్య ప్రాచ్య దేశాల నుంచే వస్తున్నాయి. భౌగోళిక రాజకీయంగా ఎప్పుడూ ఉద్రిక్తతలు నెలకొనే 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' వంటి వివాదాస్పద జలమార్గాల ద్వారా ఈ సరఫరా జరుగుతుండటం భారత్‌కు పెద్ద సవాలు. అంతర్జాతీయంగా ఏ చిన్న యుద్ధ మేఘాలు కమ్మినా లేదా ఆ సముద్ర మార్గంలో నౌకల రాకపోకలకు ఆటంకం కలిగినా, మన దేశంలోని కోట్ల మంది ఇళ్లలో వంట నిలిచి పోయే ప్రమాదం ఉంది. మనం ఇంధన ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించకుండా, కేవలం ఒకే ప్రాంతంపై, అది కూడా అస్థిరమైన రాజకీయ పరిస్థితులు ఉన్న దేశాలపై ఆధారపడటం అనేది పాలకుల దూరదృష్టి లేమికి నిదర్శనమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, దేశ సార్వభౌమాధికారానికి సంబంధించిన అంశం.

## వ్యూహాత్మక నిల్వ కేంద్రాల లేమి..15 రోజుల నిల్వతో దేశం భద్రమేనా?

చమురు నిల్వలకు (Strategic Petroleum Reserves) ఉన్నట్లుగా, వంట గ్యాస్ కోసం మన దేశంలో ఎటువంటి 'వ్యూహాత్మక నిల్వ కేంద్రాలు' లేకపోవడం అత్యంత విచారకరం. ప్రస్తుతం ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థల వద్ద ఉన్న నిల్వలు కలిపినా కేవలం 15 రోజుల వినియోగానికి మాత్రమే సరిపోతాయి. అంటే, ఏవైనా కారణాల వల్ల దిగుమతులు నిలిచిపోతే, కేవలం రెండు వారాల్లోనే దేశం మొత్తం అంధకారంలోకి లేదా ఆకలి చావుల్లోకి వెళ్లే అవకాశం ఉంది. యుద్ధం వంటి అత్యవసర పరిస్థితులు తలెత్తితే ఈ నిల్వలు ఏమాత్రం చాలవు. ఒక పటిష్టమైన ఇంధన భద్రతా ప్రణాళికలో భాగంగా కనీసం 45 రోజుల అవసరాలకు సరిపడా భూగర్భ లేదా ఉపరితల నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఉంది. దీనికోసం వేల కోట్ల పెట్టుబడి అవసరమైనప్పటికీ, దేశ ప్రజల ప్రాథమిక అవసరాల ముందు ఇది చాలా స్వల్పం. ఒక్క రోజు నిల్వ సామర్థ్యం పెంచుకోవడానికి సుమారు రూ. 2,000 కోట్లు ఖర్చవుతాయని అంచనా, కానీ భవిష్యత్తులో వచ్చే సంక్షోభాల ఆర్థిక నష్టం దీనికంటే వేల రెట్లు ఎక్కువగా ఉంటుంది.

## సరఫరా మార్గాలను విస్తరించుకోవాలి, ప్రత్యామ్నాయం ఎక్కడ?

కేవలం మధ్య ప్రాచ్యంపైనే కాకుండా, ప్రపంచంలోనే గ్యాస్ ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న అమెరికా వంటి దేశాల నుండి దిగుమతులను పెంచుకోవడం ద్వారా ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. అమెరికా నుండి రావడానికి నౌకలకు సుమారు 45 రోజుల సమయం పట్టినప్పటికీ, వివిధ దేశాల నుండి సరఫరా మార్గాలను కలిగి ఉండటం వల్ల (Diversifying Sourcing) ఏదైనా ఒక ప్రాంతంలో సంక్షోభం తలెత్తినా మన దేశీయ అవసరాలకు ఆటంకం కలగదు. మన రిఫైనరీలు అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉన్నప్పటికీ, ముడి చమురు నుండి వచ్చే గ్యాస్ ఉత్పత్తి కేవలం 3–5 శాతానికి మించడం లేదు. అందుకే దేశీయంగా సహజ వాయువు ఉత్పత్తిని పెంచడంపై దృష్టి సారించాలి.



## శాశ్వత పరిష్కారం..స్వదేశీ వనరులే శరణ్యం

గ్యాస్ కొరతను అధిగమించాలంటే కేవలం దిగుమతులపై దృష్టి పెడితే సరిపోదు. మన దేశంలో లభ్యమయ్యే సహజ వాయువు (Natural Gas) వినియోగాన్ని గృహ అవసరాలకు మళ్లించాలి. ముంబై తీరం, కృష్ణా–గోదావరి బేసిన్, రాజస్థాన్ వంటి ప్రాంతాల నుండి వస్తున్న గ్యాస్‌ను పైపుల ద్వారా నేరుగా ఇళ్లకు చేరవేయాలి (PNG). దీనివల్ల సిలిండర్ల రవాణా ఖర్చులు తగ్గడమే కాకుండా, గ్యాస్ వృధాను అరికట్టవచ్చు. వీటికి తోడు, భవిష్యత్తులో ఇంధన స్వయం సమృద్ధి సాధించడానికి 'విద్యుత్ పొయ్యిల' (Electric Cooking) వాడకాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలి. ఇది ప్రస్తుతం కొంచెం ఖరీదైనదిగా అనిపించినా, విదేశీ గ్యాస్‌పై ఆధారపడకుండా ఉండటానికి ఇదొక్కటే శాశ్వత మార్గం. సోలార్ విద్యుత్ ద్వారా ఈ పొయ్యిలను నడిపించేలా సాంకేతికతను సామాన్యులకు అందుబాటులోకి తీసుకురావాలి.

మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైంది!

"గోతిలో పడ్డ ఆవును బయటకు తీయడమే కాదు, అది మళ్ళీ గోతిలో పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే సరైన నిర్వహణ" అన్న మేనేజ్‌మెంట్ పాఠం మన పాలకులకు తెలియంది కాదు. ప్రభుత్వం కేవలం తాత్కాలికంగా బుకింగ్‌లను నియంత్రించడంతో లేదా చట్టాలను కఠినతరం చేయడంతో సరిపెట్టకూడదు. ఇది కేవలం ఒక పూట సమస్య కాదు, దేశ భవిష్యత్తుకు సంబంధించిన అంశం. పటిష్టమైన ఇంధన విధానాన్ని రూపొందించి, నిల్వ సామర్థ్యాన్ని యుద్ధ ప్రాతిపదికన పెంచుకోవాలి. వంట గ్యాస్ రవాణాలో వాడే నౌకలకు రక్షణ కల్పించడం నుండి, కొత్త మార్గాలను అన్వేషించడం వరకు ప్రతి అడుగు ఆచితూచి వేయాలి. అప్పుడే పది కోట్ల భారతీయ కుటుంబాల వంటగది భద్రంగా ఉంటుంది. పాలకుల అజాగ్రత్త ఇలాగే కొనసాగితే, రేపు దేశం మొత్తం తీరని ఇంధన సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం ఉంది. దేశ ప్రజల ఆకలిని తీర్చే పొయ్యిలు ఆరిపోకముందే మేల్కొనడం అత్యవసరం!

**వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ**
**9848559863**

# హర్మూజ్ విముక్తికి అమెరికా యత్నాలు



## ఇరాన్ బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం యూరోపియన్ దేశాలు సైతం మద్దతు

వాషింగ్టన్/లండన్:
హర్మూజ్‌పై పట్టుకు అమెరికా యత్నాలు ప్రారంభించింది. ఇరాన్ క్షిపణులను, డ్రోన్లు, బోట్లను ఎదుర్కొనేందుకు సన్నద్ధం అవుతోంది. హర్మూజ్ విముక్తికి యూరోపియన్ దేశాలు సైతం మద్దతుగా ముందుకు సాగనున్నాయి. ప్రపంచ చమురు జీవనాడి హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు కీలక పోరును అమెరికా మొదలుపెట్టింది. ఇందుకోసం తీర ప్రాంతంలో ఇరాన్ మోహరించిన క్షిపణి లాంచర్లు, డ్రోన్లు, బోట్లు వంటి లక్ష్యాలను ఛేదించేందుకు తక్కువ ఎత్తులో ఎగిరే అపాచీ అటాక్ హెలికాప్టర్లు , తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలను రంగంలోకి దింపినట్లు అమెరికా సైనికాధికారులను ఉటంకిస్తూ కథనంలో వెల్లడించింది. అమెరికా ఛైర్మన్ ఆఫ్ ది జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కెయిన్ ఈ విషయాన్ని వెల్లడించినట్లు తెలిపింది. ఈ జలసంధిలో ఇరాన్ సీమైన్స్, బోట్స్, మిసైల్స్ నుంచి ఎదురయ్యే ప్రమాదాల్ని అరికట్టేందుకు ఈ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ప్రాంతాన్ని దిగ్బంధిస్తూ ఇరాన్ పరిచిన ఉచ్చులను పూర్తిగా తొలగించడానికి వారానికి పైగా సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ జలసంధి మూసివేతతో చమురు ధరలు 119 డాలర్లను తాకిన విషయం తెలిసిందే. భారీ ఆయుధాలతో ఎ`10 యుద్ధ విమానాలకు తోడు అపాచీ అటాక్ హెలికాప్టర్లను కూడా పంపించింది. ఇవి హర్మూజ్ జలసంధిపై అతితక్కువ ఎత్తులో ఎగురుతూ శత్రులక్ష్యాలను మట్టుబెడుతున్నాయి. ఎ`10 యుద్ధ విమానాలు దక్షిణ తీర ప్రాంతాల్లోని ఇరాన్ ఫాస్ట్ అటాక్ క్రాఫ్ట్‌లను లక్ష్యంగా చేసుకొన్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో తమ మిత్ర దేశాలు కొన్ని అటాక్ డ్రోన్లను ఎదుర్కోవడానికి అపాచీ హెలికాప్టర్లను రంగంలోకి దించినట్లు జనరల్ డాన్ కెయిన్ వెల్లడించారు. అయితే.. ఆ దేశాల పేర్లు చెప్పేందుకు నిరాకరించారు. వాస్తవానికి కొన్నాళ్ల నుంచే ఎ`10, అపాచీ హెలికాప్టర్లు ఈ పనిచేస్తున్నట్లు చెప్పారు. వీటికి అండగా ఇప్పటికే ఆ ప్రాంతంలో [illegible]టైర్ జెట్లు కూడా పనిచేస్తున్నాయి. ఇప్పటివరకు 120 నౌకలను పేల్చేసినట్లు రక్షణ మంత్రి పీట్‌హెగ్సేత్ వెల్లడించిన విషయం తెలిసిందే. అమెరికా ఎ`10 విమానాలను పదాతి దళాలకు క్లోజఎయిర్ సపోర్ట్ మిషన్ల కోసం నిర్మించారు. తాజాగా ఇప్పుడు వాటిని నౌకలను ధ్వంసం చేయడానికి
వినియోగిస్తున్నారు. దీని ముక్కుపై 30 ఎంఎం గన్ ఉండగా.. రెక్కలపై బాంబులు అమర్చి ఉంటాయి. అమెరికా ఎ`10 విమానాలు జోర్డాన్ కేంద్రంగా ఉన్నాయి. వీటిని గతంలో ఐసిస్‌పై ఆపరేషన్లకు వాడారు. ఇప్పటికే దాదాపు 2,200 మంది అమెరికా మెరైన్ కమాండోలు ఇరాన్ యుద్ధంలో పాల్గొనేందుకు బయల్దేరారు. వీరు ఇరాన్ దక్షిణతీరంలోని ద్వీపాలను స్వాధీనం చేసుకొని హర్మూజ్ జలసంధిపై పట్టు సాధించాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది. ఇదిలావుంటే హోర్ముజ్ జలసంధి రక్షణ ప్రయత్నాల్లో చేరేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అలాగే ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి చర్యలు తీసుకుంటామని ఐరోపా దేశాలైన బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, నెదర్లాండ్స్, జపాన్ మరియు కెనడాలు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. గల్ఫ్‌లో నిరాయుధ వాణిజ్య నౌకలపై ఇరాన్ ఇటీవల జరిపిన దాడులను, చమురు మరియు గ్యాస్ సహా పౌర మౌలిక సదుపాయాలపై జరిపిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటన పేర్కొంది. హోర్ముజ్ జలసంధిని మూసివేయడాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాము. తీవ్రమవుతున్న ఘర్షణ పట్ల మేము తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాము. ఇరాన్ తన బెదిరింపులను, డ్రోన్ మరియు క్షిపణి దాడులను, వాణిజ్య నౌకాయానానికి జలసంధిని అడ్డుకునే ఇతర ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం 2817కు కట్టుబడి ఉండాలని పిలుపునిస్తున్నామని పేర్కొంది. జలసంధి ద్వారా సురక్షిత ప్రయాణాన్ని నిర్ధారించడానికి తగిన ప్రయత్నాలకు సహకరించేందుకు మేము సిద్ధంగా ఉన్నాము. సన్నాహక ప్రణాళికలో నిమగ్నమైన దేశాల నిబద్ధతను మేము స్వాగతిస్తున్నామని ప్రకటన పేర్కొంది. వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలను సమన్వయంతో విడుదల చేయడానికి అధికారం కల్పించిన అంతర్జాతీయ ఇంధన సంస్థ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాము. ఉత్పత్తిని పెంచడానికి కొన్ని ఉత్పాదక దేశాలతో కలిసి పనిచేయడంతో సహా, ఇంధన మార్కెట్లను స్థిరీకరించడానికి ఇతర చర్యలు తీసుకుంటామని పేర్కొంది.

### మధ్యప్రాచ్యంలో తగ్గని ఉద్రిక్తతలు

మధ్యప్రాచ్యంలో యుద్ధ ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరిన తరుణంలో, ఇరాన్ తన పొరుగు దేశాలకు కీలక విజ్ఞప్తి చేస్తూనే పరోక్ష హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడులు చేయడానికి అమెరికాకు, ఇజ్రాయెల్‌కు తమ భూభాగాలను లేదా సైనిక స్థావరాలను ఉపయోగించుకోనివ్వవద్దని పశ్చిమాసియా దేశాలను ఇరాన్ కోరింది. ప్రస్తుత సంక్షోభానికి ప్రాంతీయ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలే ముఖ్య కారణమని ఇరాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ స్థావరాల నుంచే తమపై దాడులు జరుగుతున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఐక్యరాజ్యసమితి చార్టర్, అంతర్జాతీయ చట్టాల ప్రకారం.. ఏ దేశం కూడా తన భూభాగాన్ని వేరొక దేశంపై దాడి చేయడానికి మూడవ పక్షానికి ముఖ్యంగా అమెరికా, ఇజ్రాయెల్‌లకు ఇవ్వకూడదని ఇరాన్ గుర్తు చేసింది. అమెరికా దాడులకు సహకరించే లేదా సౌకర్యాలు కల్పించే దేశాలను కూడా దురాక్రమణలో భాగస్వాములుగానే పరిగణిస్తామని, అటువంటి స్థావరాలు తమకు 'లక్ష్యాలు' అవుతాయని ఇరాన్ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయ్ హెచ్చరించారు. తమ సార్వభౌమాధికారంపై దాడులు జరిగితే, అంతర్జాతీయ చట్టాల ప్రకారం తమను తాము రక్షించుకునే హక్కు తమకు ఉందని ఇరాన్ స్పష్టం చేసింది. సౌదీ అరేబియా వంటి దేశాలు చేస్తున్న వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని, ఈ ప్రాంతంలో అస్థిరతకు అమెరికా, జియోనిస్ట్ (ఇజ్రాయెల్) శక్తులే కారణమని ఇరాన్ విమర్శించింది.

# ఎరువుల ఉత్పత్తికి ఇంధన పోటు




**ఎరువుల సరఫరాను నిలిపివేయనున్న చైనా భారత్ తదితర దేశాలకు రవాణ ఆపే చర్యలు పలుదేశాల వ్యవసాయరంగంపై తీవ్ర ప్రభావం**

న్యూఢిల్లీ :

ముడి చమురు సరఫరాలో అవాంతరాలతో ఇక్కట్ల పాలవుతున్న ప్రపంచదేశాలకు కొత్త సమస్య వచ్చి పడేటట్టు ఉందన్న భయాలు నెలకొన్నాయి. ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పటికే చమురు సరఫరా సమస్యలు ఎదుర్కొంటున్నాయి. మరోవైపు ప్రపంచంలోని అతిపెద్ద ఎరువుల ఎగుమతిదారుల్లో ఒకటిగా ఉన్న చైనా యుద్ధ ప్రభావం వల్ల.. జెట్ ఇంధనం, డీజిల్, ఎరువుల ఎగుమతులపై పలు నిబంధనలు విధించడానికి చర్యలు తీసుకుంటోంది. దీంతో ప్రపంచ మార్కెట్‌లో యూరియా కొరత ఏర్పడే అవకాశం ఉందని వ్యవసాయ ఆధారిత దేశాల్లో ఆందోళన నెలకొంది.ఎరువుల ఎగుమతుల్లో ప్రపంచంలో నెం.2గా ఉన్న చైనా వీటి ఎగుమతులపై ఆంక్షలకు సిద్ధమైంది. ఎగుమతుల్లో కోత పెట్టాలని చైనా ఆర్థిక ప్రణాళిక సంస్థ ఎన్‌డీఆర్సీ దేశీయ సంస్థలకు సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో జెట్ ఫ్యుయెల్, డీజిల్, కిరోసిన్‌ల ఎగుమతులను తగ్గించాలని గత నెలలో ఎన్‌డీఆర్సీ సూచించింది. దేశీయ ఇంధన, ఆహార అవసరాల కోసం చైనా ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. చైనా ఎరువులు ఆస్ట్రేలియా, వియత్నాం వంటి దేశాలతో పాటు భారత్‌కూ ఎగుమతి అవుతుంటాయి. కొన్ని దేశాలకు ఎగుమతులను నిలిపివేయాలని తమకు ఆదేశాలు అందాయని షాండాంగ్ ప్రావిన్స్‌లోని ఒక ఫర్టిలైజర్ సంస్థ అధికారి పేర్కొన్నారు. అయితే, ఈ ఆంక్షల విషయమై చైనా ఇంకా అధికారికంగా స్పందించలేదు. ఎగుమతులకు బ్రేకులు తప్పవని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడు తున్నాయి. దేశీయ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు చైనా అన్ని చర్యలు తీసుకుంటుందని అంటున్నాయి. ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ డేటా ప్రకారం, ఎరువుల ఎగుమతుల్లో రష్యా నెం.1 కాగా రెండో స్థానంలో చైనా ఉంది. జెట్ ఫ్యుయెల్ ఎగుమతి చేసే దేశాల్లో చైనా ఆరవ స్థానంలో ఉంది. అంతర్జాతీయ వాణిజ్య కేంద్రం డేటా ప్రకారం.. జెట్ ఇంధనం, డీజిల్, కిరోసిన్‌ల విదేశీ రవాణాను నిలిపివేయాలని చైనా జాతీయ అభివృద్ధి, సంస్కరణల కమిషన్ అక్కడి పరిశ్రమ వర్గాలకు ఆదేశాలు జారీ చేసింది. మార్చి మధ్య నుంచే నైట్రోజన్, పొటాషియం ఎరువుల మిశ్రమాలపై నిబంధనలు విధించింది. ఇప్పటికే యూరియా ఎగుమతిని బ్యాన్ చేసిన బీజింగ్.. అమ్మోనియా సల్ఫేట్ ఎగుమతికి మాత్రం అనుమతినిచ్చింది. ఇంధన, ఆహార నిల్వలు పరిరక్షించుకోవడానికి, దేశీయ మార్కెట్‌ను కాపాడుకోవడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాల్సి ఉంది. అయితే భారత్‌కు ఎరువుల ఎగుమతిని నిలిపివేయాలని చైనాలోని షాన్‌డాంగ్ ప్రావిన్స్‌లోని ఓ ఎరువుల తయారీ సంస్థకు ప్రభుత్వ ఆదేశాలు వచ్చినట్లు అక్కడి ఉద్యోగులు వెల్లడించారు. బీజింగ్ నుంచి ఆస్ట్రేలియా, వియత్నాం, భారత్ సహా పలు దేశాలు ప్రస్తుతం ఎరువులను దిగుమతి చేసుకుంటున్నాయి. చైనా నుంచి ఎగుమతులు నిలిచిపోవడం వల్ల ప్రపంచ మార్కెట్‌లో యూరియా ధరలు పెరిగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనివల్ల వ్యవసాయ ఆధారిత దేశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. మరోవైపు యూరియా ఉత్పత్తికి అవసరమైన ద్రవరూప సహజ వాయువు ఎలఎన్‌జీ సరఫరా లేకపోవడంతో భారత్‌లోని పలు యూరియా కంపెనీలు ప్లాంట్లను మూసివేసే పరిస్థితులు నెలకొన్నట్లు ఇటీవల పలు సర్వేలు వెల్లడించాయి.

# పుస్తకం లాంటిదే మన జీవితం !

(ఆధ్యాత్మిక చింతన )

కొత్త పుస్తకంలో అన్ని పుటలూ ఖాళీగానే ఉంటాయి. ప్రతి పుటా ఓ తెరిచిన పుస్తకమే. ఓ పుటలో పిచ్చి గీతలు గీసినా, లేక స్ఫూర్తినిచ్చే కథనాలు రాసినా అది ఆ పుస్తకంలో భాగం మాత్రమే. దాన్ని వదిలి మరో పుట తిప్పితే మరకలు లేని వర్తమానం స్వాగతం పలుకుతుంది. తెలిసో తెలియకో గత తప్పిదాల అనుభవం రెండో భాగాన్ని అర్థవంతంగా మలచుకోవడానికి ప్రేరణ కావాలి. దీన్ని జీవితానికి అన్వయిస్తే పుస్తకంలోని ప్రతి పుటా మన జీవితంలో ఓరోజు వంటిది. ప్రతి సూర్యోదయం మనకు ఆ రోజు సద్వినియోగమో దుర్వినియోగమో అయ్యేందుకు అవకాశం కల్పిస్తూనే ఉంటుంది. మునుపటి అనుభవంతో భవిష్యత్తుకు మార్గం చూపే వాక్యాలు వర్తమానంలోనే రాసుకోవాలి. ఇదంతా కూడా పాజిటివ్ దృక్పథం అలవర్చుకుంటేనే సాధ్యం అవుతుంది. నెగెటివ్ థాట్స్‌కు దూరంగా ఉండాలి. అలా ఉంటేనే మన అవయవాలు సరిగా పనిచేస్తాయి. లేకుంటా వాటిపై ప్రభావం పడి అవి పనిచేయకుండా చచ్చుపడతాయి. మన శరీరంలోకి వెళ్లిన ఆహారం 24 గంటల్లో... మలినంగా బయటికి వెళ్లిపోవాలి. లేకపోతే ఆ మలినాలు జబ్బులకు కారణం అవుతాయి. శరీరంలోకి వెళ్లిన గాలి ఒక నిముషంలోగా బయటికి వెళ్లిపోవాలి లేకపోతే మనం రోగ గ్రస్తులం అవుతాం. మరి మనలోకి చేరిన కోపం, అసూయ, ద్వేషం, మోసం... ఇలాంటివన్నీ సంవత్సరాలుగా మనలోనే ఉంటే... ఏమౌతుందో తెలుసా... మనం నిత్య రోగగ్రస్తులుగా అవుతాం. నెగెటివ్ ఎనర్జీతో నిత్యం మరణిస్తున్నామన్న చేదు నిజాన్ని త్వరగా గ్రహించాలి. మనలో చేరి బయటికి వెళ్లిపోకుండా తిష్ట వేసుకొని... మన జీవితాల్ని మృతప్రాయం చేస్తున్న కోపాన్ని, ఒత్తిడిని, ద్వేషాన్ని, బద్ధకాన్ని, అనారోగ్యాన్ని ప్రతి రోజూ ధ్యానం, యోగ చెయ్యడం ద్వారా ప్రాణశక్తిని ఎక్కువగా పొందగలం.



# ఓట్స్ వర్సెస్ మ్యూస్లీ

## బ్రేక్‌ఫాస్ట్‌లో ఏది తింటే బరువు త్వరగా తగ్గుతారు?

ఓట్స్ అనేవి నేరుగా ధాన్యం నుండి సేకరించినవి. వీటిని రోల్డ్ ఓట్స్, స్టీల్-కట్ ఓట్స్ లేదా ఇన్‌స్టంట్ ఓట్స్ అని పిలుస్తారు. వీటిలో గ్లూటెన్ ఉండదు. పీచు పదార్థం పుష్కలంగా ఉంటుంది. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. శరీరంలోని చెడు కొవ్వును తగ్గిస్తాయి. షుగర్ ఉన్నవారికి ఇది ఒక అద్భుతమైన ఆహారం. వీటిని పాలు లేదా నీటిలో ఉడికించి, పండ్లు లేదా కూరగాయలు కలిపి ఉప్మా లాగా కూడా చేసుకోవచ్చు.





**ఓట్స్**: ఓట్స్ అనేవి ప్రాసెస్ చేయబడిన తృణధాన్యాలు, వీటిని సాధారణంగా పాలు లేదా నీటితో ఉడికించి తింటారు. ఇవి ఫైబర్ (ముఖ్యంగా బీటా-గ్లూకాన్) కు మంచి వనరు. మరోవైపు, మ్యూస్లీ అనేది ఓట్స్, ఇతర ధాన్యాలు, ఎండిన పండ్లు (ఐతీఏ టతీబఱ్ం), విత్తనాలు, గింజల మిశ్రమం. దీనిని ఉడికించాల్సిన అవసరం లేదు, నేరుగా పాలు లేదా పెరుగుతో కలిపి తీసుకోవచ్చు.

**మ్యూస్లీ**: మ్యూస్లీ అనేది సిద్ధంగా ఉన్న అల్పాహారం (=ఱఎవ్‌-శీ-ఱఞ్). ఇందులో ఓట్స్‌తో పాటు మొక్కజొన్న రేకులు (జశీతీఅ టశ్రీఞవం), బాదం, కిస్మిస్, సన్ ఫ్లవర్ సీడ్స్ వంటివి కలిసి ఉంటాయి. ఇందులో రకరకాల గింజలు ఉండటం వల్ల మినరల్స్, విటమిన్లు ఎక్కువగా అందుతాయి. దీనిని ఉడికించాల్సిన పనిలేదు కాబట్టి సమయం ఆదా అవుతుంది. మార్కెట్లో లభించే ఫ్లేవర్ మ్యూస్లీలో చక్కెర, ప్రిజర్వేటివ్‌లు ఎక్కువగా ఉంటాయి. కొనే ముందు ప్యాకెట్ వెనుక ఉన్న వివరాలను గమనించాలి.

**ఏది బెస్ట్?**: మీరు బరువు తగ్గాలని చూస్తుంటే, అదనపు చక్కెర లేని ప్లెయిన్ ఓట్స్ ఉత్తమ ఎంపిక. ఎందుకంటే ఇందులో క్యాలరీలు తక్కువగా ఉండి, ఎక్కువ సేపు కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తాయి. ఒకవేళ మీరు వ్యాయామం చేసేవారైతే, తక్షణ శక్తి (×అర్ఖిత్ జుఅవతీస్త్రఎ) కావాలనుకుంటే, పోషకాలు నిండిన మ్యూస్లీని ఎంచుకోవచ్చు.



ఓట్స్, మ్యూస్లీ రెండూ ఆరోగ్యకరమైన అల్పాహార ఎంపికలే. ఏది ఎంచుకున్నా అందులో పంచదారకు బదులుగా తేనె లేదా ఖర్జూరాలు వాడటం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి. కానీ, వాటిలో ఒకటి ఎంచుకోవాల్సి వస్తే, ఓట్స్‌నే ఎంచుకోవాలని నిపుణులు చెబుతున్నారు. మ్యూస్లీలో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. మ్యూస్లీతో పోలిస్తే ఓట్స్‌లో చక్కెర లేకపోవడం వల్ల కూడా కేలరీల సంఖ్య అదుపులో ఉంటుంది. బరువు తగ్గించుకోవడానికి ఎంచుకుంటే, ఓట్స్ ఒక మంచి ఎంపిక అవుతుంది.

# కోడి లివర్ మసాలా కర్రీ

## ఇలా వండితే తినరా మైమరిచి..!



**కావాల్సిన పదార్థాలు :**
పావు కిలో కోడి లివర్, 4 ఉల్లిపాయలు, మూడు టమాటాలు, నాలుగు పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్ట్, ఒకటిన్నర స్పూన్ కారం, అర టీ స్పూన్ పసుపు, ఒక టేబుల్ ధనియాల పౌడర్, అర టీ స్పూన్ గరం మసాలా పౌడర్, రుచికి సరిపడా ఉప్పు, కరివేపాకు ఆకులు, అర కట్ట కొత్తిమీర, అర కప్పు నూనెను తీసుకోవాలి.

ముందుగా కోడి లివర్‌ను తీసుకుని బాగా శుభ్రం చేసుకుని చిన్న ముక్కలుగా చేసుకుని ప్లేట్ లో పక్కన పెట్టుకోవాలి. పాన్‌లో ఆయిల్ వేసి కరివేపాకు ఆకులు , కట్ చేసిన పచ్చిమిర్చిని వేసి బాగా వేయించాలి.

ఆ తర్వాత ఉల్లిపాయలు ముక్కలు వేసి వేసి గోల్డ్ రంగులోకి మారే వరకు బాగా వేయించాలి. ఇప్పుడు ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి, టమాటా ముక్కలు వేసి మెత్తగా అయ్యే వరకు వాటిని బాగా ఉడికించాలి.

ఆ తర్వాత దానిలో కారం, అర టీ స్పూన్ పసుపు, ఒక టేబుల్ స్పూన్ ధనియాల పొడి, రుచికి సరిపడా ఉప్పు వేసి వాటిని బాగా కలపాలి. మీరు మసాలా పొడులు వేసేటప్పుడు కొంచం తగ్గించి వేసుకోవాలి.

ముందుగా రెడీ చేసి పెట్టుకున్న కోడి లివర్ ముక్కలు వేసి కలిపి పది నిమిషాల పాటు బాగా ఉడికించాలి. చివర్లో గరం మసాలా పొడి , అర కట్ట కొత్తిమీర వేసి స్టవ్ ఆఫ్ చేసి దించేయడమే. ఈ టేస్టీ కర్రీని వేడి వేడి అన్నం లేదా రోటీలతో తింటే రుచి అద్భుతంగా ఉంటుంది.

## సమ్మర్‌లో పెరుగు

# పుల్లగా అవుతోందా?

### ఈ సూపర్ ఐడియాస్‌తో వాటికి చెక్ పెట్టేయండి

**భారతీయ భోజనంలో పెరుగు లేనిదే ముద్ద దిగదు. ముఖ్యంగా ఎండాకాలంలో చల్లటి పెరుగు లేదా మజ్జిగ శరీరానికి ఎంతో ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే, వేసవిలో గృహిణులకు ఎదురయ్యే ప్రధాన సమస్య.. తోడు పెట్టిన పెరుగు అతి త్వరగా పులిసిపోవడం. రాత్రి పూట తోడు పెట్టిన పెరుగు ఉదయానికల్లా విపరీతమైన పులుపుతో, గట్టి వాసనతో ఉండటం మనం చూస్తుంటాం. దీనికి కారణం పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల బాక్టీరియా వేగంగా వృద్ధి చెందడమే. మరి వేసవిలో కూడా పెరుగును తాజాగా, తియ్యగా ఉంచుకోవడానికి కొన్ని చిట్కాలు ఇప్పుడు తెలుసుకుందాం.**



చాలామంది అన్ని కాలాల్లోనూ ఒకే పరిమాణంలో తోడు వేస్తుంటారు. కానీ వేసవిలో అర లీటర్ పాలకు అర టీస్పూన్ తోడు వేస్తే సరిపోతుంది. ఎక్కువ తోడు వేయడం వల్ల బాక్టీరియా వేగంగా విస్తరించి పెరుగును వెంటనే పులిసేలా చేస్తుంది.

పెరుగు తోడుకున్న వెంటనే దానిని గది ఉష్ణోగ్రత వద్ద ఉంచకూడదు. పెరుగు గడ్డ కట్టినట్లు అనిపించగానే వెంటనే ఫ్రిజ్‌లో పెట్టాలి. పెరుగు సెట్ అయ్యాక కూడా బయటే ఉంచితే, పులుపు ఎక్కడం ఆగిపోదు. ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల ఆ ప్రక్రియ మందగిస్తుంది.



కిచెన్‌లో స్టౌ దగ్గర లేదా ఎండ తగిలే చోట పెరుగును తోడు పెట్టకూడదు. సాధ్యమైనంత వరకు చల్లగా ఉండే మూలలో లేదా నీడ ఉన్న ప్రదేశంలో ఉంచాలి. అవసరమైతే ఇన్సులేటెడ్ క్యాస్రోల్ వాడటం వల్ల ఉష్ణోగ్రత సమతుల్యంగా ఉంటుంది.

పెరుగు తోడ పెట్టడానికి స్టీల్ పాత్రల కంటే మట్టి పాత్రలు అత్యంత ఉత్తమం. మట్టి పాత్రలు సహజంగానే అదనపు తేమను పీల్చుకుంటాయి. దీనివల్ల పెరుగు గడ్డలాగా ఉండటమే కాకుండా, ఎక్కువ సేపు చల్లగా, తియ్యగా ఉంటుంది.

పెరుగును తీయడానికి ఎప్పుడూ తడి లేని, శుభ్రమైన స్పూన్‌ను మాత్రమే వాడాలి. వాడిన తర్వాత పాత్రపై మూత సరిగ్గా ఉంచాలి. పెరుగును వాడుకున్న వెంటనే మళ్ళీ ఫ్రిజ్‌లో పెట్టడం మర్చిపోకూడదు.

పెరుగు పులవకుండా ఉండాలంటే కేవలం ఉష్ణోగ్రతను నియంత్రిస్తే చాలు. పైన పేర్కొన్న చిన్న చిన్న చిట్కాలు పాటిస్తే, ఈ మండు వేసవిలో కూడా మీరు ప్రతిరోజూ తాజాగా, తియ్యగా ఉండే గడ్డ పెరుగును ఆస్వాదించవచ్చు.

# చికెన్, మటన్‌ను మైమరిపించే

## పచ్చి బొప్పాయి కూర.. .. ఇలా చేస్తే ఇంటిల్లిపాదీ ఫిదా

కావాల్సిన పదార్థాలు :
అర కిలో పచ్చి బొప్పాయి ముక్కలు, రెండు పెద్ద ఉల్లిపాయ, నాలుగు పచ్చిమిర్చి, రెండు పెద్ద టమాటోలు, ఒక టేబుల్ స్పూన్ అల్లం వెల్లుల్లి పేస్టు, రెండు టేబుల్ స్పూన్లు నెయ్యి, రెండు టేబుల్ స్పూన్లు కారం, ఒక టేబుల్ స్పూన్ ధనియాల పొడి, అర టీ స్పూన్ జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పు, అర కట్ట కొత్తిమీర.

ముందుగా పచ్చి బొప్పాయి ముక్కలను సిద్ధం చేసుకోవాలి: పచ్చి బొప్పాయి నీటితో రెండు సార్లు బాగా కడిగి వాటిని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి ఒక ప్లేట్ లోకి తీసుకోవాలి.



ముక్కలు పెద్దగా అస్సలు కట్ చేయకండి. ఉడకడానికి చాలా సమయం పడుతుంది. ఇప్పుడు గ్యాస్ వెలిగించి ఒక పాన్‌లో నూనె వేసి, అది వేడయ్యాక దానిలో జీలకర్ర వేసి బాగా వేయించుకోవాలి. కొద్దీ సేపటి తర్వాత ఉల్లిపాయ ముక్కలు, కట్ చేసిన పచ్చిమిర్చి, ఒక టేబుల్ అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి మీడియం మంటపై బాగా వేయించుకోవాలి. ఉల్లిపాయలు రంగు మారే వరకు పొయ్యి మీదే ఉంచండి.

ఉల్లిపాయలు బాగా మగ్గిన తర్వాత టమాటో ముక్కలు, ఒక టేబుల్ స్పూన్ ధనియాల పొడి, రెండు టేబుల్ స్పూన్స్ కారం , రుచికి సరిపడా ఉప్పు వేసి మిక్స్ అయ్యేలా కలుపుకోవాలి. టమాటోలు ఉడికే వరకు పొయ్యి మీదే ఉంచాలి.



చివర్లో ముందుగా రెడీ చేసి పెట్టుకున్న పచ్చి బొప్పాయి ముక్కలు వేసి బాగా ఉడికే వారికి స్టవ్ మీదే ఉంచాలి. ఇవి మరి మెత్తగా అయ్యే వరకు ఉంచకూడదు. దించే ముందు కొద్దిగా కొత్తిమీర వేసి అన్నంలో తినడమే.

## ఇక బాదుడే.. బాదుడు..

# ఫుడ్ ప్రియులకు భారీ షాక్

## ఇవ్వబోతున్న జోమాటో..!

**మీరు కూడా ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ అయిన జొమాటో నుండి ఫుడ్ ఆర్డర్ చేస్తే మీకు కూడా ఒక పెద్ద షాక్ తగలబోతోంది. ఆ కంపెనీ ప్లాట్‌ఫామ్ ఫీజును పెంచాలని నిర్ణయించింది. అలాగే ఈ నిర్ణయం మీ జేబుపై భారం మోపుతుంది. జొమాటోలో అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం..**




వినియోగదారుల నుండి వసూలు చేసే ప్లాట్‌ఫామ్ ఫీజును ఇప్పుడు రూ. 2.40 పెంచారు. ఈ పెంపు ప్రతి ఆర్డర్‌పై వర్తిస్తుంది. అంటే మీరు రోజుకు ఒకసారి ఫుడ్ ఆర్డర్ చేసినా లేదా 10 సార్లు చేసినా ప్రతిసారీ ఎక్కువ చెల్లించాల్సి ఉంటుంది. జీఎస్టీ అమలుకు ముందు ప్రతి ఆర్డర్‌పై రూ.12.50 వసూలు చేసేవారు. కానీ ఇప్పుడు ఈ ఛార్జీని రూ.14.90కి పెంచారు. గత పెంపు సెప్టెంబర్ 2025లో జరిగింది. పన్నును జోడించిన తర్వాత జొమాటో పోటీదారు అయిన స్విగ్గీ, ప్రస్తుతం ప్రతి ఆర్డర్‌పై రూ.14.99 ప్లాట్‌ఫామ్ ఫీజును వసూలు చేస్తోంది. ఈ రెండు కంపెనీలు ఒకే విధమైన ధరల విధానాలను అనుసరిస్తున్నాయి.

**రాపిడో ఫుడ్ డెలివరీ వ్యాపారంలోకి..**
ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ కొత్త పరిణామాలకు దారితీస్తున్న తరుణంలో ఈ కొత్త పెంపు చోటుచేసుకుంది. అర్బన్ మొబిలిటీ స్టార్టప్ అయిన రాపిడో ఇటీవల బెంగళూరులో 'ఓన్లీ' అనే తన ఫుడ్ డెలివరీ సర్వీస్‌ను ప్రారంభించింది. డెలివరీ ఫీజుకు మించి కస్టమర్ల నుండి గానీ, రెస్టారెంట్ల నుండి గానీ ఎలాంటి అదనపు రుసుములను వసూలు చేయబోమని ఆ కంపెనీ స్పష్టం చేసింది. ఫుడ్ డెలివరీ ఆర్డర్లకు జోడిస్తున్న అనేక ఛార్జీల గురించి కస్టమర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో రాపిడో తీసుకున్న ఈ చర్య ఇప్పటికే ఉన్న సంస్థలపై కొంత ఒత్తిడిని పెంచవచ్చు.

**వినియోగదారులపై ప్రభావం:**
పెరుగుతున్న ముడి చమురు ధరల నేపథ్యంలో ప్లాట్‌ఫారమ్ ఫీజులు పెరిగాయి. అధిక ఇంధన ధరలు డెలివరీ కార్యకలాపాలపై ప్రభావం చూపి, ప్లాట్‌ఫారమ్‌లోని రెస్టారెంట్లు, డెలివరీ భాగస్వాములను ప్రభావితం చేయవచ్చు. ఫుడ్ డెలివరీ రంగంలో పోటీ పెరుగుతున్నప్పటికీ, వినియోగదారులకు ఈ మార్పు వల్ల ప్రతి ఆర్డర్‌కు ఎక్కువ చెల్లించాల్సి వస్తుంది.






# హెచ్ఆర్ఏ మినహాయింపు పరిమితి పెంపు

హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న వారికి కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. ఇంటి అద్దెభత్యం మినహాయింపు పరిమితిని 50 శాతానికి పెంచింది. ఈ మేరకు ఆదాయపు పన్ను నిబంధనలు, 2026ను కేంద్రం శుక్రవారం నోటిఫై చేసింది. ఆరు దశాబ్దాల పాత ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో.. కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఏప్రిల్ 1 నుంచి రాబోయే కొత్త నిబంధనలను నోటిఫై చేస్తూ గెజిట్ జారీ చేసింది.

గతంలో ముంబయి, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నైలను మాత్రమే మెట్రో నగరాలుగా పరిగణించేవారు. ఆయా నగరాల్లో హెచ్ఆర్ఏ మినహాయింపు పరిమితి 50 శాతంగా ఉండేది. తాజాగా ఈ జాబితాలోకి హైదరాబాద్, బెంగళూరు, పుణె, అహ్మదాబాద్‌ను కూడా చేర్చారు. అంటే 8 నగరాల్లో నివసిస్తున్న ఉద్యోగులు తమ జీతంలో 50 శాతం వరకు హెచ్ఆర్ఏ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. మిగిలిన వారికి యథాతథంగా 40 శాతం కొనసాగుతుంది. కొత్త ఆర్థిక సంవత్సరంలో అంటే 2027 జులైలో ఫైల్ చేయబోయే రిటర్నుల సమయంలో ఇది వర్తిస్తుంది.






పాత పన్ను విధానంలో పన్నును తగ్గించుకోవడానికి ఈ మార్పు ఉపయోగపడుతుంది. కొత్త పన్ను విధానం ఎంచుకున్న వారు ఈ మినహాయింపు పొందలేరు. అలాగే, హెచ్ఆర్ఏ మినహాయింపు పొందాలంటే ఇకపై పన్ను చెల్లింపుదారులు తాము నివసిస్తున్న ఇంటి యజమానితో (ల్యాండ్‌లార్డ్) తమకు ఉన్న సంబంధాన్ని తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుంది. ఫారం 124లో ఆ వివరాలు నమోదు చేయాలి.

పార్లమెంట్ ఆగస్టు 12న కొత్త ఆదాయపు పన్ను బిల్లుకు ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. సంక్షిప్తంగా ఉన్న ఆదాయపు చట్టాన్ని సులభతరం చేయడం దీని ఉద్దేశం. పాత ఆదాయపు పన్ను చట్టంలో 819 సెక్షన్లు ఉండగా.. కొత్త దాంట్లో 536కు కుదించారు. అలాగే చాప్టర్లను సైతం 47 నుంచి 23కు తగ్గించారు. పాత ఆదాయపు పన్ను చట్టంలో 5.12 లక్షల పదాలు ఉండగా దాన్ని.. దాదాపు సగానికి అంటే 2.6 లక్షలకే పరిమితం చేశారు. అదనంగా 39 కొత్త టేబుళ్లు 40 ఫార్ములాలను జోడించారు.

## ఆరంభ లాభాలు

# ఆవిరి..

### ఆల్‌టైమ్ కనిష్ఠానికి రూపాయి విలువ



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. నిన్నటి భారీ నష్టాల నుంచి కోలుకుని ఉదయం భారీ లాభాల్లో ట్రేడ్ అయిన సూచీలు.. ఆఖర్లో మళ్లీ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. దీంతో స్వల్ప లాభాలకే పరిమితమయ్యాయి. అదే సమయంలో రూపాయి విలువ మరింత క్షీణించింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86 పైసలు క్షీణించి 93.75 వద్ద ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది.
సెన్సెక్స్ ఉదయం 74,559.38 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,207.24) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో దాదాపు వెయ్యి పాయింట్ల మేర లాభపడి 75,286.39 వద్ద గరిష్ఠాన్ని తాకింది. మధ్యాహ్నం తర్వాత అమ్మకాల ఒత్తిడి ఎదురుకావడంతో సెన్సెక్స్ 325.72 పాయింట్ల లాభంతో 74,532.96 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 112.35 పాయింట్ల లాభంతో 23,114.50 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ట్రెంట్, రిలయన్స్ స్టాక్స్ లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బీఈఎల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఇండిగో స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4665 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



**కుత్బుల్లాపూర్, మార్చి 20 (నినాదం):** కుత్బుల్లాపూర్ డివిజన్ చింతల్ ఎమ్మెల్యే కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన సుమారు 123 మంది లబ్ధిదారులకు, 45 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్ష, నాయకుల చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ లోని అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించే నాయకులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అని, గత పన్నండేళ్ళ కాలంలో కోట్లాది రూపాయల నిధులతో ప్రజలకు ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమ పథకాలు అందించిన నాయకులు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అని వివరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన గోపాల్ గౌడ్



**కాప్రా, మార్చి 20 (నినాదం) :** మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా షామీర్పేట్ లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ చంద్రమౌళి, సీనియర్ నాయకులు గడ్డం రాజిరెడ్డి, క్రాంతి కుమార్, డివిజన్ మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజులవాణి, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## మనుషుల మధ్య సేవా భావం, దాతృత్వం పెంపొందించడమే రంజాన్

### బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, మార్చి 20 (నినాదం):** ముస్లింలు అత్యంత పవిత్రంగా 40 రోజులు ఉపవాస దీక్ష చేపట్టే ఈ పవిత్రమాసంతో మనుషుల మధ్య సౌహార్దం, సహనం, సేవాభావం, దాతృత్వం వంటి గొప్ప విలువలను పెంపొందించే పవిత్ర కాలమని బి ఆర్ ఎస్. ఎల్ పి. విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. రంజాన్ నెలలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్షలు మనిషిలో ఆత్మ నియంత్రణను పెంపొందించడమే కాకుండా, సమాజంలో సమానత్వ భావనను బలపరుస్తాయని అన్నారు. పేదవారికి సహాయం చేయడం, పరస్పరం ప్రేమాభిమానాలు పంచుకోవడం ద్వారా సమాజంలో ఐక్యత మరింత బలపడుతుందని ఆయన ఆకాంక్షించారు.ఈ పవిత్ర పండుగ ప్రతి ఇంటిలో ఆనందం, ఆరోగ్యం, శాంతి నింపాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ అభివృద్ధి పథంలో నడవాలని ఆయన కోరారు.

# డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలు దిశగా కీలక అడుగు

### కలెక్టర్ ప్రావీణ్య
### సంబంధిత సిబ్బందికి శిక్షణ

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 20 (నినాదం):** సంగారెడ్డి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు శ్రీకారం చుట్టగా, సంబంధిత సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రోగుల పూర్తి వైద్య వివరాలను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. జిల్లాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ అమలుకు సంబంధించి డాటా ఎంట్రీ ఆపరేటర్లు, మెడికల్ ఆఫీసర్లు, స్పెషలిస్ట్ డాక్టర్లకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం సంగారెడ్డి జిల్లా మెడికల్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, సంగారెడ్డి డివిజన్‌లో పైలెట్ ప్రాజెక్టుగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను ప్రారంభిస్తున్నామని, జీజీహెచ్, జోగిపేట్, పటాన్చెరు ఏరియా ఆసుపత్రులు, సదాశివపేట సీహెచ్సీతో పాటు సంగారెడ్డి డివిజన్ పరిధిలోని 15 పీహెచ్సీలలో సోమవారం నుంచి ఈ ప్రాజెక్ట్ అమలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని సూచించారు.సంబంధిత



సిబ్బంది తమ సిస్టమ్స్, మొబైల్ ఫోన్లలో అవసరమైన సాఫ్ట్‌వేర్ లేటెస్ట్ వెర్షన్‌లో ఉందో లేదో ముందుగానే పరిశీలించాలని, అందరికీ లాగిన్ సదుపాయం ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని చోట వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోగి ఆసుపత్రికి వచ్చిన మొదటి దశ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు ఓపీ, మెడికల్ ఆఫీసర్, ల్యాబ్, ఫార్మసీ తదితర విభాగాల్లో రోగి వైద్య చరిత్రను డిజిటల్ రూపంలో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని



తెలిపారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలన్నారు. జిల్లాలో అమలు చేయనున్న ఈ పైలెట్ ప్రాజెక్టును విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ వసంతరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డాక్టర్ శశాంక్, స్పెషలిస్ట్ డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడా స్టేడియం కోసం 20 ఎకరాలు కేటాయించాలి

### అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి ఆకుల సతీష్ వినతి

**కుత్బుల్లాపూర్, మార్చి 20 (నినాదం):** కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం పరిధిలో ఉన్న సర్వే నంబర్ 307 ప్రభుత్వ భూమి పరిరక్షణ కోసం స్థానిక ప్రజలు, నాయకులు చేస్తున్న పోరాటం ఫలించి ప్రభుత్వం, సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవడం అభినందనీయం అని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ పేర్కొన్నారు. ప్రజల ఒత్తిడి, నిరంతర పోరాటాల కృషి వల్ల ఈ భూమిని కాపాడటంలో ముఖ్యమైన ముందడుగు పడిందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న మొత్తం 317 ఎకరాల ప్రభుత్వ భూమిలో రిజిస్ట్రేషన్ శాఖ, ఆర్టీసీ బస్ డిపో, పోలీస్ ట్రాన్స్పోర్ట్ విభాగం, పోలీస్ రిజర్వ్ ఫోర్స్ వంటి వివిధ ప్రభుత్వ విభాగాలకు సుమారు 265 ఎకరాలు కేటాయించిందన్నారు. ఇది ప్రభుత్వ అవసరాల దృష్ట్యా జరిగినప్పటికీ, స్థానిక ప్రజల అవసరాలు కూడా సమానంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని ఆకుల సతీష్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ప్రత్యేకంగా కుత్బుల్లాపూర్ అసెంబ్లీ పరిధిలోని ప్రగతి నగర్, నిజాంపేట్, దుండిగల్ వంటి ప్రాంతాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ ప్రాంతాలలో నివసిస్తున్న వేలాది మంది యువతకు సరైన క్రీడా మైదానాలు, స్టేడియంలు లేకపోవడం చాలా బాధాకరమని ఆకుల సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం యువతకు క్రీడలు ఆడేందుకు, శారీరక వ్యాయామం చేయేందుకు, ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు సరైన సదుపాయాలు లేకపోవడం వల్ల అనేక



ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.ఈ నేపథ్యంలో గాజుల రామారం సర్వే నంబర్ 307లో కనీసం 20 ఎకరాల భూమిని క్రీడా మైదానం లేదా సమగ్ర క్రీడా స్టేడియం నిర్మాణానికి కేటాయించాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌కు సంబంధించి అదనపు కలెక్టర్ విజేందర్ రెడ్డికి వినతి పత్రం సమర్పించగా, ఆయన సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్‌తో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆకుల సతీష్ పత్రిక ప్రకటనలో తెలిపారు. అధికారుల ఈ స్పందనపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ, త్వరలోనే ప్రజలకు అనుకూలమైన నిర్ణయం తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, పాండు, కృష్ణారెడ్డి, ఇతర స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈ డిమాండ్‌కు మద్దతు తెలిపారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి



**అల్వాల్, మార్చి 20( నినాదం):** రంజాన్ పర్వదినం సందర్భంగా మల్కాజిగిరి శాసన సభ్యులు శ్రీ మర్రి రాజశేఖరరెడ్డి తెలంగాణ ముస్లిం సమాజానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.దివ్య ఖురాన్ అవతరించిన పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నియమనిష్ఠలతో ఉపవాస దీక్షలు చేసి పండుగను జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. ముస్లింల ందరూ శ్రద్ధాసక్తులతో జరుపు కునే ఈ పండుగ వారికి అతి ముఖ్యమైనదని శ్రీ మర్రి రాజశేఖరరెడ్డి తన సందేశంలో పేర్కొన్నారు. గౌరవ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ముస్లింల భద్రత,సంక్షేమం, సముద్ధరణ కోసం పలుపథకాలు, కార్యక్రమాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేశారన్నారు. కేసీఆర్ అన్ని ధర్మాలను సమదృష్టితో చూసే గొప్ప లౌకికవాది అని,ఆయన పదేళ్ల పాలనలో మత సామరస్యం వెల్లివిరిసి గంగాజమున సంస్కృతికి రాష్ట్రం నిలయంగా మారిందని శ్రీ మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు.మైనారిటీలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు గురుకుల పాఠశాలలను పెద్ద సంఖ్యలో ప్రారంభించి ఇంగ్లీష్ మీడియంలో నాణ్యతా ప్రమాణాలతో విద్యనందించారని శ్రీమర్రి రాజశేఖరరెడ్డి కొనియాడారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు షాదీ ముబారక్ లక్షా 116 రూపాయల చొప్పున ఉచితంగా అందించారన్నారు.మహ్మద్ ప్రవక్త ప్రవచించిన ప్రేమ, శాంతి, సత్యం,సహనం,దయ, కరుణ బోధనలు ఆనాడు, ఈనాడు, ఏనాటికైనా ప్రపంచ మానవాళిక ఆచరణనియమని అన్నారు. ఈద్-ఉల్-ఫితర్ పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ఆనందోత్సాహాల మధ్య ప్రశాంతంగా జరుపు కోవాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు.

## సుచిత్ర కాలనీలో ఘనంగా ఉగాది సంబరాలు



**కీసర, మార్చి 20, (నినాదం):** కీసర సర్కిల్, నాగారం డివిజన్, రాంపల్లి సుచిత్ర కాలనీ కమ్యూనిటీ హాల్లో ఉగాది పండగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా సుచిత్ర కాలనీ కమిటీ హాల్లో లలిత కళా నాట్యమండలి నంది అవార్డు గ్రహీత మాధురి వేణుగోపాల్ శిష్య బృందంచే కూచిపూడి సాంస్కృతిక నృత్య ప్రదర్శన నిర్వహించారు. చిన్నపిల్లల నృత్య ప్రదర్శనకి కాలనీవాసులు మంత్రముగ్ధులైనారు. అనంతరం గురువు మాధురి వేణుగోపాల్ ని సాలువాతో సత్కరించి, నృత్య ప్రదర్శనలో పాల్గొన్న పిల్లలకి బహుకరించారు. ఈ కార్యక్రమంలో సుచిత్ర కాలనీ కమిటీ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ స్మశానవాటికలో.. చెత్తడంపింగ్ సమస్య పరిష్కరించాలి

### •సీఎంకు ఎమ్మెల్యే వినతి

**అల్వాల్, మార్చి 20 (నినాదం):** అల్వాల్ జిహెచ్ఎంసి పరిధిలోనిమచ్చ బొల్లారం హిందూ స్మశానవాటికలో జరుగుతున్న చెత్త డంపింగ్‌కు వ్యతిరేకంగా స్థానిక ప్రజలు చేస్తున్న నిరసనను రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి దృష్టికి మల్కాజ్‌గిరి శాసన సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి చెత్త డంపింగ్ యార్డ్ ని హిందూ శ్మశానం నుండి మరో చోటికి తరలించడం కోసం జిల్లా యంత్రాంగం మున్సిపల్ అధికారులను పలుమార్లు ప్రత్యామ్నాయ స్థలాల కోసం కోరినప్పటికీ, అలాగే హైకోర్టు.జాతీయ మానవ హక్కుల కమిషన్ నుండి ఆదేశాలు వచ్చినప్పటికీ,



ఇప్పటివరకు సమస్యకు సరైన పరిష్కారం లభించలేదని ఎమ్మెల్యే. సీఎంకు తెలిపారు. దీంతో తానే స్వయంగా ముందడుగు వేసి, జేఏసి నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి పలు స్థలాలని పరిశీలించి, డైరీ ఫార్మ్ రోడ్ వద్ద మిలిటరీకి చెందిన ఖాళీ స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. ఆ స్థలాన్ని చెత్త డంపింగ్ కోసం కేంద్ర ప్రభుత్వంతో బదలాయింపు చేసుకొని, ప్రస్తుతం స్మశానవాటికలో జరుగుతున్న చెత్త డంపింగ్‌ను పూర్తిగా నిలిపివేసి, సుమారు 50 కాలనీల ప్రజలను రక్షించాలని ముఖ్యమంత్రిని అభ్యర్థించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మచ్చ బొల్లారం ప్రజలను చెత్త డంపింగ్ సమస్య నుండి విముక్తి కల్పించేందుకు అన్ని స్థాయిలలో తనవంతు కృషి కొనసాగిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మచ్చ బొల్లారం జేఏసి నాయకులు, వివిధ కాలనీల ప్రతినిధులు ఎమ్మెల్యే కు తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## శానిటేషన్ నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి





### ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పిలుపు

**జవహర్‌నగర్, మార్చి 20 (నినాదం):** సానిటేషన్ నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రాబోవు వేసవి కాలం దృష్ట్యా, కాలనీల శుభ్రత, పరిశుభ్రత, వీధి దీపాల నిర్వహణలో, భద్రతా ప్రమాణాలు పాటించాలని, కీసర సర్కిల్ పరిధిలోని ప్రాంతాలను శానిటేషన్, శుభ్రత, లో ప్రజలకు అవగాహన కలిగించాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ దమ్మాయిగూడ, పిఎస్ రావు నగర్, భవాని నగర్ కాలనీలలో, కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంతతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం పట్ల ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రగతికి పెద్దపీట వేస్తుందని, కీసర సర్కిల్ అభివృద్ధి పదంలో పయనించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం శానిటేషన్ నిర్వహణ నిమిత్తం టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బందికి తగిన సూచనలు జారీ జారీ చేశారు. ఈ కార్యక్రమంలో కీసర డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలా?

### డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు వివేకానంద స్వామి



**జవహర్‌నగర్, మార్చి 20 (నినాదం):** విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడవద్దని డిఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం వివేకానంద స్వామి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌పై డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డీఎస్ఎఫ్ఐ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎం. వివేకానంద స్వామి తీవ్ర విమర్శలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,గత ఏడాదితో పోలిస్తే అనేక మార్పులు, చేర్పులు చేశామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, విద్యా మరియు వైద్య రంగాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. ఏడాది కాలంగా ఈ రంగాలకు పెద్దపీట వేస్తామని ప్రకటించినా, బడ్జెట్‌లో ఆ ప్రభావం కనిపించడం లేదని అన్నారు.ప్రస్తుతం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం లేదని ఖండించారు. విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధి, వైద్య సదుపాయాల మెరుగుదలపై స్పష్టమైన చర్యలు కనిపించడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం మాటలకే పరిమితం కాకుండా విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కాంక్షిత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉచిత వైద్య సేవలను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలి

### మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి

**ఈటల జన్మదినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహణ**



**మల్కాజిగిరి, మార్చి 20 (నినాదం):** మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా వినాయక నగర్ డివిజన్‌లోని ప్రధాన మంత్రి జన ఔషధి కేంద్రానికి చెందిన గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో వినాయక నగర్ ప్రధాన రహదారి వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి పాల్గొని ఉచిత వైద్య శిబిరంను ప్రారంభించి, టెస్ట్ లు చేసుకున్న వారికి ఉచిత మందులను అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ వచ్చిన వైద్య సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందించదగ్గ విషయమని అన్నారు. వైద్య శిబిరం ద్వారా సుమారు మూడు వందల మంది వరకు ఉచిత వైద్య సేవలను వినియోగించుకోవడం జరిగిందని తెలిపారు.

## కొత్త సీసాలో పాత సార పోసిన చందంగా బడ్జెట్

### బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్

**వికారాబాద్, మార్చి 20(నినాదం ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026-2027 బడ్జెట్ కొత్త సీసాలో పాత సార పోసిన ఛందంగా ఉందని బిఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ అన్నారు. అన్ని వర్గాలను ప్రభుత్వం దగా చేసి, నయవంచన చేసిన బడ్జెట్ ఎస్సీ, ఎస్టీలు, బీసీలు, మైనారిటీలు, అగ్రవర్ణ పేదలను నట్టేట ముంచెందిగా ఉందని అన్నారు. కేసీఆర్ ఎప్పుడో చెప్పారని తప్పిదారి కాంగ్రెస్ ఓటు వేస్తే రైతుబంధుకు రామ్ రామ్, దళిత బంధుకు జై భీమ్ మని జోష్యం చెప్పారని ఆయన గుర్తు చేశారు. ఆ మాటలను నేడు సీ ఎం రేవంత్ సర్కార్ నిజం చేస్తుందని అన్నారు. కౌలు



రైతుల ఊసే లేదని ఆటో వాళ్లకు, ఆర్టీసీ కార్మికులకు అన్యాయం జరిగిందని మహిళలకు, విద్యార్థినులకు అవమానం జరిగిందని అన్నారు. ఉద్యోగులకు, నిరుద్యోగులను బడ్జెట్ దగా చేసిందని ఏదైనా ఎలక్షన్ ఈ మధ్యలో వస్తే దాని ఫలితాలతో రేవంత్ సర్కార్ కూలిపోతదని జోష్యం చెప్పారు. అధినేత కెసిఆర్ చెప్పినట్లు కాంగ్రెస్‌కు ఓటువేస్తే మోసపోతము, గోసపడు తాము అన్న మాటలు నిజమవు తున్నాయని చెప్పారు. భూమి సూర్యుని చుట్టూ తిరుగుతు ందని మనందరికీ తెలుసు కానీ రేవంత్ సర్కారు ఏ పని చేసినా భూముల చుట్టూ తిరుగుతుందని, రియల్ ఎస్టేట్ దందా మాత్రమే గుర్తుకొస్తుందని అన్నారు. ఐదు బడ్జెట్లలో మూడు బడ్జెట్లు ఈ రోజుతో పూర్తయినవని మిగిలినవి రెండు మాత్ర మేనని ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ లలో ఏ ఒక్క హామి కూడా పూర్తిగా నెరవేర్చలేక పోయారన్నారు. ప్రజలందరూ అన్ని విషయాలు గమనిస్తూ ఉన్నారని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాజకీయంగా సమాధి చేయటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## అందరి సహకారంతో అభివృద్ధి

### శివాలయం నూతన కమిటీ హామీ



**వికారాబాద్, మార్చి 20(నినాదం):** జిల్లాలో తెలంగాణ శ్రీశైలంగా ప్రసిద్ధి చెందిన నవాబుపేట మండలం ఎల్లా కొండలో నీ పురాతన శివాలయ నూతన కమిటీ ని శనివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అందరిసహకారంతో ఆలయాభివృద్ధి చేస్తామని కమిటీ ముక్తకంఠంతో హామీ ఇచ్చింది. దాదాపు వెయ్యి సంవత్సరాల చరిత్ర గల ఈ దేవాలయం తొలి కాకతీయుల కాలంలో నిర్మితమైయిందని పురాతన వస్తు శాఖ పేర్కొన్న నేపథ్యంలో ఆలయానికి గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. కొండపై వెలసిన పార్వతీ పరమేశ్వర ఈ ఆలయానికి చైర్మన్‌గా పట్లోళ్ల భరత్ రెడ్డి ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా దేవాలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా జరిగింది. పాలక మండలిని గ్రామ సర్పంచ్ కొండల్ యాదవ్ ప్రమాణ స్వీకారం చేయించారు. వైస్ చైర్మన్లు బయన్న గూడెం సీతారాం, పెంటని బుచ్చయ్యలను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా బేగరి శంకరయ్య, చాకలి లింగం, ముష్టి అశోక్, చాకలి అనంతయ్య, నర్సిములు, వడ్ల మొనప్ప, సంగని పరమేశ్ ప్రమాణం చేశారు.

## ఎన్టీఆర్‌నగర్‌లో దవాత్- ఏ- ఇఫ్తార్ విందు



**ఎల్ బినగర్, మార్చి 20(నినాదం):**రంజాన్ మాసం పర్వదినం ను పురస్కరించుకుని మహేశ్వరం నియోజకవర్గం ఎన్టీఆర్ నగర్ డివిజన్ లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తమలపాకుల హర్షలత ఆధ్వర్యంలో దవాత్- ఏ - ఇఫ్తార్ విందు ఏర్పటు చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జల్ పల్లి నరేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనది అని, రంజాన్ మాసం సందర్భంగా నిష్టతో పాటించే ఉపవాస దీక్షలు, దైవ ప్రార్థనలతో సామరస్యం, శాంతి సౌభ్రాతత్వం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినం ను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం చాలా అభినదించదగ్గ విషయం అన్నారు. రంజాన్ పండుగ ప్రజా జీవితాల్లో సుఖ సంతోషాలను అందించాలని అభిలషించారు. రంజాన్ మాసం ఉపవాసం తో మంచి తనం సంస్కారం అలవమతుందని, మతసామరస్యానికి ప్రతీక అందరూ కలిసి ఉండాలని ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టడం పెట్టినట్లు తెలిపారు. ముస్లింల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. ఈ విధమైన ఆధ్యాత్మిక దైవ ప్రార్థనలతో శాంతి, సోదరబాదం. సౌభ్రాతృత్వానికి రంజాన్ ప్రతీక అని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్, సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ యాదవ్, ఎన్టీఆర్ నగర్ బస్తీ వాసులు రాజు నాయక్, ఎంఎం మమ్మద్ ఆలీ, అస్లాం లాలు, ముస్లిం మత పెద్దలు. ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



**మల్కాజిగిరి, మార్చి 20(నినాదం):** మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం మల్కాజిగిరిలోని సాయి నగర్ చౌరస్తా లో బిజెపి నాయకులు సంతోష్ రామ్ దాస్, బీజేపీ గౌతమ్ నగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి మాశెట్టి అనిల్ ల ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ ఈటల రాజేందర్ జన్మదినోత్సవం పురస్కరించుకొని ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో సంతృప్తినిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు ఈసం రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు అనుమతి లేదు

### కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి బ్యూరో, మార్చి 20 (నినాదం):** జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య స్పష్టం చేశారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షలను పారదర్శకంగా, కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, డిపార్ట్మెంటల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె దిశానిర్దేశం చేశారు. పరీక్ష



కేంద్రాల్లోకి ఎవరూ మొబైల్ ఫోన్లు తీసుకురావద్దని, కేంద్రంలో ఉన్న సిబ్బంది సహా ఎవరి వద్దా మొబైల్ ఫోన్లు ఉండకూడదని స్పష్టం చేశారు. పరీక్ష ప్రారంభానికి ముందు ప్రతి హాలును క్షుణ్ణంగా పరిశీలించి చూడాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎలాంటి సంఘటనలు జరిగినా సంబంధిత చీఫ్ సూపరింటెండెంట్, ఎంఈఓలదే బాధ్యత అని స్పష్టం చేశారు. సబ్జెక్ట్ టీచర్లను క్లరికల్ సిబ్బందిగా ఉపయోగించి నట్లయితే వారిని వెంటనే రిలీవ్ చేసి ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులను నియమించాలని ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యంలో ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ షీట్లను క్లోజ్డ్ వాహనాలలో సురక్షితంగా తరలించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపాట్మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

## నూతన తహసీల్దార్ భవనాల్లో..
## అవసరమైన ఏర్పాట్లు చేయాలి

### కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, మార్చి 20(నినాదం):** ఏదుల, రేవల్లి మండలాల్లో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సేవలు అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఏదుల, రేవల్లి మండలాల్లో పర్యటించారు. ఆయా మండలాల్లో నూతనంగా నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న తహసీల్దార్ కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయ భవనాల నిర్మాణ నాణ్యత, సౌకర్యాలను సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏదుల, రేవల్లి మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలను నూతనంగా నిర్మించిన భవనాలకు షిఫ్ట్ చేసి, అక్కడ నుంచే ప్రజలకు సేవలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతన భవనాల్లో ఫర్నిచర్ ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్లకు ఆదేశించారు. ఈ నూతన కార్యాలయాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని త్వరలోనే నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సేవలు అందేలా నూతన కార్యాలయాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఏదుల తహసిల్దార్ మల్లికార్జున్, రేవల్లి తహసిల్దార్ సరస్వతి, మండల వ్యవసాయ అధికారి రమేష్, ఇతర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు

## ఈటలకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి



**మల్కాజిగిరి, మార్చి 20( నినాదం):** మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా వినాయకనగర్ మాజీ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి, డివిజన్ కార్యకర్తలతో కలిసి షమీర్‌పేటలోని ఆయన నివాసంలో ఈటల ను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువా తో సత్కరించి, జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈటల ఆయురారోగ్యాలతో ఉంటూ, ప్రజా జీవితంలో ఇంకా ఎంతో ఎత్తు ఎదగాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు మంగేష్, ఓం ప్రకాష్, జగదీశ్ చారి, సంతోష్, సాయి సురేష్, సుమలత, మహేష్, ప్రవీణ్, నరేందర్ పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం

### జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ సైదులు

### నూతన సిఐని మర్యాదపూర్వకంగా కలిసిన భవన నిర్మాణ కార్మిక సంఘం



**జవహర్‌నగర్, మార్చి 20 (నినాదం):** శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తామని, నేరాల అదుపులో ఆధునిక సాంకేతికను ఉపయోగించి నేరస్తులను కటకటాల్లోకి నెడుతామని జవహర్ నగర్ ఎస్హెచ్వో ఎస్. సైదులు తెలిపారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు శుక్రవారం జవహర్ నగర్ నూతన ఇన్స్పెక్టర్గా సైదులు పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మర్యాదపూర్వకంగా ఇన్స్పెక్టర్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ సంఘ నాయకులతో ఇన్స్పెక్టర్ సైదులు మాట్లాడుతూ జవహర్ నగర్ లో పేద మధ్య తరగతి జనాభా ఎక్కువగా ఉందని ప్రజల సంక్షేమం కోసం శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. నేరాల అదుపులో ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి పెద్దపీట వేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్షులు చెన్నాపురం యాదయ్య, గౌరవ అధ్యక్షులు కొయ్యాడ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, మరాటి బాబు, చెన్నారెడ్డి, వై. మల్లేష్, రమణారెడ్డి, ఐలయ్య, రాములు, రవి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగను.. ప్రశాంతంగా జరుపుకోవాలి

### ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపిఎస్



**వికారాబాద్, మార్చి 20(నినాదం):** క్రమశిక్షణ, దానగుణం, సహనానికి ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగను వికారాబాద్ జిల్లాలోని ముస్లిం సోదరులందరు ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ తెలిపారు. ఈ సందర్భంగా పండగ శుభాకాంక్షలు కూడా తెలిపారు. నెల రోజుల పాటు అత్యంత నిష్ఠతతో ఉపవాస దీక్షలు విరమించి జరుపుకునే ఈ వేడుక, జిల్లా ప్రజలందరి జీవితాల్లో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు సమృద్ధిని నింపాలని ఆమె ఆకాంక్షించారు. ఈ పండుగ సమాజంలో మత సామరస్యాన్ని, సోదరభావాన్ని మరింత పటిష్టం చేయాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణం లో జిల్లా లో పండుగలు చేసుకోవాలని ఎస్పీ తెలియజేశారు.

## చేవెళ్లలో నిలిచిన డయాలసిస్ సేవలు





### • దయనీయ స్థితిలో పేషెంట్లు

**చేవెళ్ల, మార్చి 20 (నినాదం):** చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ లో సేవలు నిలిచిపోవడంతో దిక్కు తోచని స్థితిలో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొన్నేళ్ల నుంచి నడుస్తున్న డయాలసిస్ సెంటర్ ను డయాలసిస్ రోగులకు సమాచారం ఇవ్వకుండా మూసివేసారంటూ పేషెంట్లు ఆందోళన చెందుతున్నారు. చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి సమారు 50 మంది డయాలసిస్ రోగులు వైద్యం పొందుతున్నారని, ముందస్తు సమాచారం. లేకుండా తరలించడంతో దిక్కు తోచని స్థితిలో ఎదురైంది. ఆసుపత్రికి వచ్చిన డయాలసిస్ రోగుల కరెంట్ సరఫరా నిలిచిపోయిందని సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రికి వద్దకు వచ్చిన రోగులను వికారాబాద్, షాద్ నగర్ ఆసుపత్రులకు వెళ్లాలని సూచిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, జిల్లా వైద్యాధికారులు స్పదించి డయాలసిస్ రోగులు సేవలు అందేలా చూడాలని వేడుకుంటున్నారు... డయాలసిస్ చేసుకోవడానికి ఒకరోజు ముందుగానే బయలుదేరి ఆసుపత్రిలో చేరుకుంటామని, అకస్మాత్తుగా డయాలసిస్ సేవలు నిలిపివేస్తే దిక్కుచూసిని స్థితి ఎదురులేని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా లేని వారే ప్రభుత్వ ఆసుపత్రికి వస్తామని, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే డయాలసిస్ సేవలు పునరుద్ధరించాలని వేడుకుంటున్నారు.

## అంకెల ఆర్భాటం తప్ప ప్రజలకు లాభం లేదు

### అప్పుల భారమే పెరుగుతుందని వ్యాఖ్య

### తెలంగాణ బడ్జెట్‌పై బండి సంజయ్ తీవ్ర విమర్శలు



**కరీంనగర్, మార్చి 20(నినాదం):** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026,27 బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ బడ్జెట్‌ను ఆయన "మోసం, దగా, ప్రజా వంచన"గా అభివర్ణించారు. అంకెల ఆర్భాటం, కేటాయింపుల ప్రకటనలే తప్ప ప్రజలకు ఉపయోగపడే అంశాలు కనిపించడం లేదని అన్నారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచే స్పష్టమైన ప్రణాళికలు లేకుండా, మరింత అప్పులు తీసుకునేందుకు సిద్ధమవ్వడం బాధాకరమని పేర్కొన్నారు. అదనంగా లక్ష కోట్ల రూపాయల అప్పు భారం మోపే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ మూడో బడ్జెట్ అని, రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీసే దిశగా సాగుతోందని అన్నారు. రైతు భరోసా కింద ఇవ్వాల్సిన సాయం పూర్తిగా అందలేదని, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు మళ్లీ నిరాశ చెందారని చెప్పారు. మహిళలకు హామీ ఇచ్చిన ఆర్థిక సహాయం, బంగారం వంటి పథకాలపై స్పష్టత లేదని విమర్శించారు. వృద్ధులకు పెన్షన్ పెంపుపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడం దురదృష్ట కరమన్నారు. నిరుద్యోగ సమస్యను పూర్తిగా విస్మరించారని, నిరుద్యోగ భృతి అంశం బడ్జెట్‌లో కనిపించలేదని చెప్పారు. విద్యార్థులకు హామీ ఇచ్చిన ఆర్థిక భరోసాకు తగిన నిధులు కేటాయించలేదని ఆక్షేపించారు. ఆరోగ్య రంగంలో గత బకాయిలే అధికంగా ఉన్నాయని, విద్యకు తగిన శాతం నిధులు ఇవ్వలేదని విమర్శించారు. దేవాదాయ శాఖ, పుష్కరాల వంటి అంశాలకు కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని పేర్కొన్నారు. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలకు కేటాయింపులు తక్కువగా ఉన్నాయని, ఇది సామాజిక న్యాయానికి విరుద్ధమని అన్నారు. పెట్టుబడుల పేరుతో చెప్పిన వివరాలపై ప్రభుత్వం పారదర్శకత చూపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం భారీ అప్పుల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని, భవిష్యత్తులో ఈ ఆర్థిక వ్యవహారాలపై సమగ్ర విచారణ చేపడతామని బండి సంజయ్ హెచ్చరించారు.

NINADAM CINEMA

# ఉస్తాద్ భగత్‌సింగ్ హిట్‌టాక్

### దర్శకుడు హరీష్‌శంకర్ ఆనందం




ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా బాగుందన్న అభిప్రాయం రావడం ఎంతో ఆనందాన్నిచ్చిందని దర్శకుడు హరీష్‌శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో... పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్.వై సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఉగాది సందర్భంగా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్ అభిమానులు ఫోన్ చేసి 'అన్నా సినిమా చాలా బాగుంది' అంటున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చేలా సినిమాని మలిచాం. తొలి రోజు నుంచీ ఓ కమర్షియల్ సినిమా తీస్తున్నానని, ఒకప్పటిలా హుషారైన పవన్‌కల్యాణ్ ఇందులో కనిపిస్తారని చెబుతూ వచ్చా. సినిమా చూసినవాళ్లు ఈ సినిమాలో ఇన్ని అంశాలు ఉన్నాయని మాకు తెలియదంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇందులోని ప్రతి పాత్ర బాగా పండింది. అందరికృషితోనే ఇంత మంచి సినిమా చేయగలిగాం అన్నారు. నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ థియేటర్ల దగ్గర పండగ వాతావరణం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అమెరికా అనే తేడా లేకుండా అన్ని చోట్లా ప్రేక్షకులు సినిమాని ఆస్వాదిస్తున్నారు. మేం ఊహించిన దానికంటే మంచి స్పందన వచ్చింది. పవన్ కల్యాణ్ వన్ మేన్ షో ఇది. హరీశ్‌శంకర్ ఎంతో బాధ్యతగా 'గబ్బర్‌సింగ్' సినిమాని మించేలా తెరకెక్కించారు. కచ్చితంగా భారీ వసూళ్లు సాధిస్తుందీ చిత్రం' అన్నారు. నిర్మాత రవిశంకర్.వై మాట్లాడుతూ 'పెద్ద హీరో నుంచి వాణిజ్య ప్రధానమైన సినిమా వచ్చి చాలా కాలమైంది. ఇందులో కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలూ ఉన్నాయి. మాకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఈ సినిమా విజయంపై మేం సంతోషంగా ఉన్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో కళా దర్శకుడు ఆనంద్‌సాయి, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

## మణిరత్నం - రహమాన్ కాంబో

### సాయిపల్లవి, విజయ్ సేతుపతి మూవీ



దిగ్గజ దర్శకుడు మణిరత్నం తన ఆస్థాన సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్‌తో మరోసారి చేతులు కలుపబోతున్నాడు. 1992లో 'రోజా' సినిమాతో మొదలైన వీరిద్దరి అద్భుత ప్రయాణం, ఇప్పుడు 19వ సారి ఈ కొత్త సినిమాతో కొనసాగబోతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి హీరోగా నటించబోతుండగా.. 'నేచురల్ స్టార్' సాయి పల్లవి మణిరత్నం సినిమాలో హీరోయిన్‌గా నటించబోతుంది. గత కొద్ది రోజులుగా ఈ సినిమాకు యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ పనిచేస్తారనే ప్రచారం జరిగినప్పటికీ, వాటన్నింటికీ చెక్ పెడుతూ మద్రాస్ టాకీస్ సంస్థ రెహమాన్ పేరును అధికారికంగా ప్రకటించింది. ఒక ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం కోసం రెహమాన్ ఇప్పటికే ఒక పాటను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. మద్రాస్ టాకీస్ మరియు లైకా ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జూలై నాటికి ప్రారంభం కానుంది.

## 'సర్కే చునార్ తేరి సర్కే' పాట వివాదం

### నోరా ఫతేహిపై ముస్లిం సంస్థ ఫత్వా జారీ

కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్' లోని 'సర్కే చునార్ తేరి సర్కే' పాట తీవ్ర వివాదాలకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన ముస్లిం పర్సనల్ దారుల్ ఇఫ్తా అనే మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. ఈ పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని సదరు సంస్థ పేర్కొంది. ఇటువంటి ప్రదర్శనలు సమాజంలో తప్పుడు సందేశాన్ని పంపుతాయని, ముఖ్యంగా ముస్లిం యువతను తప్పుదోవ పట్టిస్తాయని వారు తమ ఫత్వాలో పేర్కొన్నారు. మరోవైపు ఈ పాటకు దేశవ్యాప్తంగా వస్తున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ఈ విషయాన్ని ధృవీకరించారు. మరోవైపు ఈ వివాదంపై నోరా ఫతేహీ స్పందిస్తూ.. ఈ పాట హిందీ వెర్షన్‌లో తనకేమీ సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. మూడేళ్ల క్రితం సంజయ్ దత్ వంటి దిగ్గజ నటుడితో కలిసి నటించే అవకాశం రావడం, అలాగే ఇది 'నాయక్ నహి ఖల్ నాయక్ హూ మై' వంటి ఐకానిక్ సాంగ్ రీమేక్ అని భావించి తాను అంగీకరించానని తెలిపారు. తనకు కన్నడ భాష తెలియదని, మేకర్స్ చెప్పిన అనువాదం అప్పట్లో అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె వివరణ ఇచ్చారు. ధ్రువ సర్జా హీరోగా, ప్రేమ్ దర్శకత్వంలో 1970ల నాటి బెంగళూరు నేపథ్యంతో తెరకెక్కిన 'కేడీ: ద డెవిల్' చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది.



### ఈ రకంగా టార్గెట్ చేయడం

# కరెక్ట్ కాదు..

### అనుష్క టీమ్ సీరియస్

టాలీవుడ్ ఎవర్ గ్రీన్ అనుష్క శెట్టి త్వరలో పెళ్లి చేసుకోబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. దీనిపై అనుష్క టీమ్ స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ షేర్ చేశారు. 'ఒకరి పర్సనల్ లైఫ్‌ను డైలీ హెడ్‌లైన్స్‌గా మార్చే ముందు కనీసం అది అఫీషియలా కాదా.. అనేది కూడా చూడటం లేదు. ఊహించడం, అంచనా వేయడం అనధికారిక సమాచారాన్ని పదేపదే ప్రచురించడం సరైన పద్ధతి కాదు. అన్నిటికంటే నిరాశ కలిగించే విషయం ఏమిటంటే.. ఆమె వయసుపై అనవసరమైన శ్రద్ధ చూపడం. ప్రతి పోస్ట్‌లోనూ 44 అనే నంబర్‌ను ఏదో వివాదాస్పదమైన అంశంలా ఎందుకు హైలైట్ చేస్తున్నారు..? వయసు అంత పెద్ద సమస్య అయితే.. హీరోల వయసు విషయంలో కూడా ఇదే ఉత్సాహం ఎందుకు కనిపించడం లేదు? మహిళల విషయంలోనే ఈ కథనం ఎందుకు భిన్నంగా ఉంటుంది. ఆమె తన కెరీర్‌ను కేవలం ప్రతిభతో, ఎంతో హుందాగా నిర్మించుకున్నారు. ఎప్పుడూ పీఆర్ స్టంట్స్‌పై ఆధారపడలేదు. తన పర్సనల్ లైఫ్‌ను గోప్యంగా ఉంచుకోవాలని కోరుకునే వ్యక్తిని ఇలా టార్గెట్ చేయడం సమంజసం కాదు.. వివాహం అనేది వ్యక్తిగత విషయం.. అది బ్రేకింగ్ న్యూస్ కాదు. కేవలం వ్యూస్ కోసం వాడాల్సిన అంశం అంతకంటే కాదు. ఇకనైనా బాధ్యతగా వ్యవహరించండి. హద్దులను గౌరవించండి.. ముఖ్యంగా హీరోయిన్లను కూడా హీరోలతో సమానంగా, గౌరవంగా చూడటం నేర్చుకోండి' అంటూ టీమ్ స్పష్టం చేశారు.

## ధురంధర్ -2కు మంచి రెస్పాన్స్




దేశభక్తి అంశాలతో కూడిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' ఓ ట్రెండ్ సెట్ చేసింది. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ మూవీ సీక్వెల్ 'ధురంధర్ 2' కూడా బాక్సాఫీసు వద్ద దూసుకెళుతోంది. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నటుడు రాకేశ్ బేడీ ఈ విజయంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ రెండు సినిమాల్లో కీలకమైన జమీల్ జమాల్ పాత్ర పోషించిన ఆయన.. తన పెర్ఫామెన్స్‌పై హీరో రణ్‌వీర్ సింగ్ ఇచ్చిన ప్రశంసను గుర్తుచేసుకున్నారు. ఈ చిత్ర బృందమంతా సెట్స్‌లో కలివిడిగా ఉండేది. నా పాత్ర షూటింగ్ పూర్తయిన రోజు.. రణ్‌వీర్ మైక్ తీసుకొని 'ఒకవేళ ఈ మూవీ రూ.1000 కోట్లు వసూలుచేస్తే.. అందులో రూ.500 కోట్లు రాకేశ్ వల్లే వస్తాయి' అని చెప్పారు. ఓ నటుడిగా ఇంతకుమించి ఏం కావాలి?' అని పేర్కొన్నారు. సీనియర్ పొలిటీషియన్‌గా నయవంచక పాత్రలో రాకేశ్ బేడీ అదరగొట్టారు. ముఖ్యంగా 'ధురంధర్ 2'లో ఈ పాత్ర ఇచ్చే ట్విస్ట్ ప్రేక్షకులకు ఓ ట్రీట్. బాలీవుడ్‌లో 47 ఏళ్ల ప్రస్థానం రాకేశ్ బేడీది. 'ధురంధర్' డైరెక్టర్ ఆదిత్యధర్ గతంలో తెరకెక్కించిన మరో హిట్ మూవీ 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్'లోనూ నటించారు. సినీప్రియుల ఆసక్తిని దృష్టిలోపెట్టుకొని 'ధురంధర్ 2'ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసిన సంగతి తెలిసిందే. తొలిరోజే రూ.100 కోట్ల క్లబ్‌లో చేరింది. ప్రపంచవ్యాప్తంగా రూ.172 కోట్లు (గ్రాస్) వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. నెట్ పరంగా రూ.145 కోట్లు అని పేర్కొన్నాయి. ఇందులో దాదాపు రూ.100 కోట్లు హిందీలోనే రావడం గమనార్హం. పెయిడ్ ప్రివ్యూల ద్వారా రూ.40 కోట్లు వచ్చాయని తెలిసింది. నెట్ కలెక్షన్లలో ఫస్ట్‌డే అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ మూవీగా 'ధురంధర్ 2' రికార్డులు నెలకొల్పింది.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787